నేడు TELUGU DAILY
## విలేకరులు కావలెను
అనతి కాలంలోనే పత్రికా రంగంలో ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్న *నేడు తెలుగు దినపత్రిక* లో పనిచేసేందుకు రిపోర్టర్లు కావలెను.
తెలంగాణలోని 33 జిల్లాలో పనిచేసేందుకు
వార్త సేకరణలో అనుభవం కలిగిన స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు తీసుకోబడును.
ఆసక్తి కలిగిన వారు nedudailynews@gmail.com కు బయోడేటా పంపించండి
ఈ నెంబర్లకు ఫోన్ చేయగలరు.
9346984911 | 9133445456





సంచలన వార్తలకు
# నేడు
TELUGU DAILY

ఆదివారం | 27.09.2026 | సంపుటి : 4 | సంచిక : 150 | పేజీలు : 8 | వెల : 2/- | www.nedudailynews.com




ఇదే నా చివరి ప్రపంచకప్ : విరాట్ కోహ్లీ 08



## సర్' నోటీసులు..

**అత్యవసరమైతే తప్ప వ్యక్తిగత విచారణకు రానక్కర్లేదు:**

### కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. సర్ నోటీసులు అందుకున్న ఓటర్లు.. అత్యవసరమైన సందర్భాల్లో తప్ప వ్యక్తిగత విచారణకు హాజరు కావాల్సిన అవసరం లేదని తెలిపింది. 'సర్' కోసం ఫారం-6కు జతచేసిన డిక్లరేషన్‌ను సుప్రీంకోర్టు సమర్థించిందని పేర్కొంది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు డా.సుఖ్‌బీర్ సింగ్ సంధూ, డా.వివేక్ జోషి నేడు ఢిల్లీలోని ఈసీ ప్రధాన కార్యాలయంలో భేటీ అయ్యారు. 'సర్'పై భిన్నాభిప్రాయాల అంశం తీవ్ర దుమారం రేపిన వేళ.. ఈ భేటీ కీలక ప్రాధాన్యం సంతరించుకుంది.

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26: కేంద్ర క్యాబినెట్ కార్యదర్శికి ఎన్నికల కమిషనర్లు రాసిన లేఖ.. ఈసీ లేదా ఐటీ విభాగాల విధానపరమైన అంశానికి సంబంధించినది కాదని, ఈసీకి డిప్యుటేషన్‌పై వచ్చిన ఓ అధికారి పనితీరుకు సంబంధించిందని ఎన్నికల సంఘం వివరించింది. సీఈసీ, ఎన్నికల కమిషనర్ల సమావేశం అనంతరం ఈమేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. "బిహార్, పశ్చిమ బెంగాల్ సహా 20 రాష్ట్రాలు/ కేంద్ర పాలిత ప్రాంతాల్లో 'సర్' ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. తమ పేర్లు నమోదు కాకుండా మిగిలిపోయిన వారు, యువకులు, మొదటిసారి ఓటు వేసేవారు.. నిరంతర అప్‌డేషన్ ప్రక్రియ ద్వారా ఓటు హక్కు కోసం సంబంధిత ఈఆర్‌వోకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని సీఈవోలకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ ఓటర్ల నమోదుకు ఎన్నికల

-మిగతా 2 లో..

# మన్మోహన్‌సింగ్‌కు భారతరత్న ఇవ్వాలి

**ఆయన గౌరవార్థం విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలి**

### ప్రధానమంత్రి మోదీకి సీఎం రేవంత్‌రెడ్డి వినతి

### 14 అడుగుల మన్మోహన్‌సింగ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం

'సరళీకరణ.. ప్రపంచీకరణ.. ప్రైవేటీకరణ పేరుతో అద్భుత సంస్కరణలను అమలు చేసి భారతదేశాన్ని ప్రపంచంలోనే గొప్ప ఆర్థిక శక్తిగా నిలబెట్టిన మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్‌కు భారతరత్న ఇవ్వాలి. ఆయన ప్రవేశపెట్టిన చట్టాల ద్వారా దేశవ్యాప్తంగా సమకూరిన అభివృద్ధి ఫలాల తీరును తెలిపే ఒక విజ్ఞాన కేంద్రాన్ని.. మన్మోహన్ గౌరవార్థం ఢిల్లీలో ఏర్పాటు చేయాలి' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు.




హైదరాబాద్, సెప్టెంబర్ 26: మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలన్న ప్రతిపాదనను తమ పార్టీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీల అనుమతితో లోక్‌సభ, రాజ్యసభలలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని వివరించారు. హైదరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ విప్రో కూడలిలో ఏర్పాటు చేసిన 14 అడుగుల మన్మోహన్ సింగ్ విగ్రహాన్ని శనివారం సాయంత్రం ఆయన ఆవిష్కరించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో సీఎం రేవంత్ ప్రసంగించారు. మన్మోహన్ 94వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించడం ఎంతో సంతోషంగా ఉందని వ్యాఖ్యానించారు. ఆయన అమలు చేసిన సంస్కరణల వల్లే ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో మైక్రోసాఫ్ట్, విప్రో సహా

-మిగతా 2 లో..



### 'తెలంగాణ తెగువకు నిలువెత్తు రూపం'..

## చాకలి ఐలమ్మ

**రైతాంగ హక్కుల కోసం ఐలమ్మ పోరాటాన్ని గుర్తుచేసిన మాజీ సీఎం కేసీఆర్**

### మలిదశ తెలంగాణ ఉద్యమంలోనూ ఆమె స్ఫూర్తి ఉందన్న వ్యాఖ్య

### జయంతిని అధికారికంగా నిర్వహించడం తమ ప్రభుత్వంలోనే ప్రారంభమైందన్న కేసీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 26: తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో కీలక పాత్ర పోషించిన చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రత్యేక ప్రకటనలో ఐలమ్మ జీవితాన్ని, ఆమె పోరాటాన్ని స్మరించుకున్నారు. తెలంగాణ తెగువ, ధిక్కార స్వరానికి ఐలమ్మ ప్రతిరూపమని కేసీఆర్ పేర్కొన్నారు. నాటి రాచరిక వ్యవస్థకు ఎదురొడ్డి రైతాంగ హక్కుల కోసం ఆమె పోరాడారని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం ఆమె చేసిన పోరాటం చరిత్రలో నిలిచిపోయిందని అన్నారు. ఐలమ్మ పోరాటంలో మరో ముఖ్యమైన అంశాన్ని కూడా కేసీఆర్ ప్రస్తావించారు. భూస్వామ్య ఆధిపత్యాన్ని

-మిగతా 2 లో..

# యూరియా దొరకని రోజులు వచ్చాయి

**రేవంత్‌రెడ్డి రైతు బంధు ఎగ్గొడుతున్నారు**

### కేసీఆర్ ప్రజల గుండెల్లో భద్రంగా ఉన్నారు

### మేనమామ తీరుగా ఆడపిల్లల తల్లులు యాది చేసుకుంటున్నారు

### కేసీఆర్ రావాలని గణేష్ మండపాల పాటలు మోత మోగాయి

### పట్టభద్రుల ఓటరు నమోదుపై పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపు

కరెంట్ కోతలు మొదలయ్యాయని.. యూరియా దొరకని రోజులు వచ్చాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. "కేసీఆర్ ప్రజల గుండెల్లో భద్రంగా ఉన్నారు. గణేష్ మండపాల దగ్గర కేసీఆర్ పాటలు మోత మోగాయి. కేసీఆర్‌ను మేనమామ తీరుగా ఆడపిల్లల తల్లులు యాది చేసుకుంటున్నారు" అని కేటీఆర్ పేర్కొన్నారు.



హైదరాబాద్, సెప్టెంబర్ 26: "రేవంత్‌రెడ్డి రైతు బంధు ఎగ్గొడుతున్నారు. పొలాల్లో మోటార్లు కాలిపోతున్నాయి. రైతు బంధు ఎగ్గొట్టిన ప్రతిసారి కేసీఆర్‌ను అన్నదాతలు గుర్తు చేసుకుంటున్నారు. తెలంగాణ ప్రజలు దుష్పరిపాలన ఫలితాలు అనుభవిస్తున్నారు. కాంగ్రెస్ అక్కర్లేదు కేసీఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారు" అని కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ తన రాజకీయ కార్యాచరణను మరింత విస్తరించే ప్రయత్నాల్లో భాగంగా కాంగ్రెస్ నుంచి నాయకులు, కార్యకర్తలను పార్టీలోకి

-మిగతా 2 లో..



### ఖైరతాబాద్ ఉపఎన్నికలో

## పోటీకి రెడీ

**ఉపఎన్నికలో అభ్యర్థిని నిలబెడతాం**

### టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటన

### దానం నాగేందర్ తీరుపై పరోక్ష విమర్శలు

### ఫామ్‌హౌస్ భూమిపై ఆరోపణలను ఖండించిన కవిత

హైదరాబాద్, సెప్టెంబర్ 26: ఖైరతాబాద్ అసెంబ్లీ ఉపఎన్నికలో తెలంగాణ రక్షణ సేన పోటీ చేయనుంది. ఆ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత శనివారం ఈ విషయాన్ని స్పష్టం చేశారు. తమ పార్టీ తరఫున అధికారికంగా అభ్యర్థిని

-మిగతా 2 లో..

# కాళేశ్వరం రిపేర్‌కు గ్రీన్ సిగ్నల్..!

### అక్టోబర్ 5న సీడబ్ల్యూసీ కమిటీకి రిపేర్ డిజైన్లు

### అనుమతులు రాగానే నవంబర్ రెండో వారంలో పనులు

### మూడు బ్యారేజీల పునరుద్ధరణకు ప్రత్యేక కార్యాచరణ

### 2027 వర్షాకాలం లోపే పూర్తి చేయాలని లక్ష్యం

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణకు ప్రభుత్వం కార్యాచరణను ఖరారు చేసింది. ఈ మూడు బ్యారేజీలకు సంబంధించిన మరమ్మతు డిజైన్లను కేంద్ర జల సంఘం సాంకేతిక పర్యవేక్షణ కమిటీ పరిశీలనకు పంపేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. అక్టోబర్ 5న డిజైన్లను సమర్పించనున్నట్లు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.



హైదరాబాద్, సెప్టెంబర్ 26: హైదరాబాద్‌లో నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో బ్యారేజీల పునరుద్ధరణపై మంత్రి సమగ్రంగా చర్చించారు. జఔజ నుంచి అవసరమైన సాంకేతిక అనుమతులు అందిన వెంటనే నవంబర్ రెండో వారంలో పనులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. పునరుద్ధరణ పనులకు సంబంధించి ఇప్పటికే వివిధ సాంకేతిక సంస్థలు, నిపుణుల కమిటీల సూచనలను

-మిగతా 2 లో..



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 107 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 134 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 208 (కిలో) |
| స్కిన్ లెస్ | 235 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹78

## జమ్మూకశ్మీర్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమే

**మీ ఉగ్రవాద చర్యలు, మోసం అందరికీ తెలుసు**

### పాకిస్థాన్‌కు భారత్ స్ట్రాంగ్ కౌంటర్




న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26: దాయాది పాకిస్థాన్‌కు ఐరాస వేదికగా భారత్ గట్టి హెచ్చరికలు చేసింది. సీమాంతర ఉగ్రవాదాన్ని ఇలాగే ప్రోత్సహిస్తే.. తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించింది. జమ్మూకశ్మీర్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమేనని పునరుద్ఘాటించింది. ఐరాస వంటి అంతర్జాతీయ వేదికలపై పాకిస్థాన్ చేస్తోన్న అబద్ధపు

-మిగతా 2 లో..



## '10 లక్షల ఎకరాలకు ఆయిల్‌పామ్ సాగు లక్ష్యం'

**ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు అనుగుణంగా ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని పెంచాలి: మంత్రి తుమ్మల**

**రైతులకు సమీపంలోనే ప్రాసెసింగ్ సదుపాయాలు.. రవాణా భారం తగ్గేలా చర్యలు**

సిద్దిపేట, సెప్టెంబర్ 26: తెలంగాణలో ఆయిల్ పామ్ సాగును పెద్ద ఎత్తున విస్తరించడంతో పాటు, రైతులకు పంటకు సంబంధించిన అన్ని రకాల మౌలిక వసతులను అందుబాటులోకి తీసుకువస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రానున్న మూడు సంవత్సరాల్లో రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని 10 లక్షల ఎకరాలకు తీసుకెళ్లే

-మిగతా 2 లో..

## వ్యవసాయానికి కరెంటు ఏడెనిమిది గంటలేనా?

### సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శ



సిద్దిపేట, సెప్టెంబర్ 26: ఇది కాలం తెచ్చిన కరవు కాదని.. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరవు అని భారాస సీనియర్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. మాజీ సీఎం కేసీఆర్ వ్యవసాయానికి 24 గంటల విద్యుత్తు అందిస్తే.. 7 నుంచి 8 గంటలు మాత్రమే సరఫరా చేస్తారా అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరులో రజక సంఘం ఆధ్వర్యంలో శనివారం

-మిగతా 2 లో..



## కాళేశ్వరం రిపేర్‌కు గ్రీన్ సిగ్నల్..!

(మొదటిపేజీ తరువాయి)

పరిశీలించినట్లు మంత్రి తెలిపారు. ముఖ్యంగా జాతీయ డ్యామ్ భద్రతా అథారిటీ సూచనలను పరిగణనలోకి తీసుకుని ముందుకు వెళ్లనున్నట్లు స్పష్టం చేశారు. కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణలో ప్రతి దశలో సాంకేతిక పరిశీలన, అనుమతులకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం గతంలోనూ స్పష్టం చేసింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల మూడు బ్యారేజీలను ఒకేసారి దృష్టిలో పెట్టుకుని పనులను చేపట్టనున్నారు. 2027 వర్షాకాలం నాటికి పునరుద్ధరణ పూర్తి చేయడం ప్రభుత్వ లక్ష్యంగా మంత్రి పేర్కొన్నారు. బ్యారేజీల నిర్మాణ నాణ్యత, భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. నిపుణుల సూచనలకు అనుగుణంగా పనులు చేపట్టి, భవిష్యత్‌లో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అక్టోబర్ 5న సమర్పించే డిజైన్లకు కేంద్ర స్థాయిలో వచ్చే స్పందన, ఆ తర్వాత నవంబర్‌లో ప్రారంభమయ్యే పనులు కాళేశ్వరం పునరుద్ధరణలో కీలక దశగా మారనున్నాయి.



## యూరియా దొరకని రోజులు వచ్చాయి

(మొదటిపేజీ తరువాయి)

ఆహ్వానిస్తోంది. ఈ క్రమంలో తెలంగాణ భవన్‌లో జరిగిన చేరికల కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు చేశారు. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై కేటీఆర్ ప్రశ్నలు సంధించారు. ఆరు గ్యారెంటీలతో పాటు ఇతర హామీలను 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. రైతుబంధు అంశాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతులకు సాగు సమయానికి పెట్టుబడి సాయం అందేదని పేర్కొంటూ, ప్రస్తుత ప్రభుత్వం మూడుసార్లు రైతుబంధు చెల్లింపులు చేయలేదని కేటీఆర్ ఆరోపించారు. గత ప్రభుత్వ పాలనను ప్రస్తావిస్తూ.. ప్రజలు కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్‌కు మళ్లీ మద్దతు ఇస్తున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. మూడేళ్లుగా కేసీఆర్ ప్రజల్లోకి రాకపోయినా గల్లీ గల్లీలో ఆయన పాటలు వినిపిస్తున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. రాబోయే రాజకీయ పరిణామాలపై కూడా కేటీఆర్ మాట్లాడారు. 2028లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని, కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఇదే సమయంలో సెప్టెంబర్ 28 నుంచి ప్రారంభమయ్యే పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. దీంతో ప్రస్తుతం జరుగుతున్న పార్టీ చేరికలతో పాటు ఓటరు నమోదు కార్యక్రమంపైనా బీఆర్ఎస్ దృష్టి పెట్టినట్లు స్పష్టమవుతోంది.

## సర్' నోటీసులు..

(మొదటిపేజీ తరువాయి)

అధికారులు తక్షణమే స్పెషల్ డ్రైవ్ ప్రారంభించనున్నారు. దేశవ్యాప్తంగా 'సర్' నిర్వహణ సహా ఈ మధ్య కాలంలో ఈసీ అనేక నిర్ణయాలు తీసుకుంది. బిహార్ నుంచి మొదలు అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో సర్ ప్రక్రియ కోసం గతేడాది జూన్ 24నాటి ఆదేశాలు ఎన్నికల కమిషన్ ఏకగ్రీవ ఆమోదంతోనే జారీ అయ్యాయి. దీన్ని సర్వోన్నత న్యాయస్థానం కూడా సమర్థించింది" అని ఈసీ తెలిపింది. గోవాలో 97 మంది అర్హులకు తుది ఓటర్ల జాబితాలో చోటుదక్కక పోవడంపై స్పందిస్తూ.. "ఓటర్ల జాబితాలో పేరు లేని అర్హుల నుంచి దరఖాస్తులు సేకరణకు ఇంటింటికీ వెళ్లాలని సంబంధిత బూత్ స్థాయి అధికారులను గోవా సీఈవో ఆదేశించారు. ఆ 97 మంది ఓటర్లలో ఇప్పటికే 81 మంది 'ఫారం-6' నింపారు" అని వెల్లడించింది.



## సైబర్ ముప్పులపై అప్రమత్తత అవసరం

### సైబరాబాద్ పోలీస్ కమిషనర్

**హైదరాబాద్:** ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి ఆధునిక సాంకేతికతలతో పాటు పెరుగుతున్న సైబర్ ముప్పులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం.రమేశ్ అన్నారు. 'ఐసాకా హైదరాబాద్ చాప్టర్' 26వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన 'ఫ్యూజన్-2026' వార్షిక సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్, డేటా రక్షణ, సైబర్ సెక్యూరిటీ, రిస్క్ తదితర అంశాలపై చర్చించారు. డేటా రక్షణ, సైబర్ రిస్క్, డిజిటల్ మోసాల నివారణకు సంస్థలు, నిపుణులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. డీప్‌ఫేక్ వీడియోలు, ఓటీపీ ఆధారిత లావాదేవీల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసాకా హైదరాబాద్ చాప్టర్ అధ్యక్షుడు సుజయ్ గంకిడి, ఉపాధ్యక్షుడు రాజ్ పవార్, సైబర్ సెక్యూరిటీ, ఆడిట్, రిస్క్ రంగాలకు చెందిన నిపుణులు, పరిశ్రమ ప్రతినిధులు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.

# మన్మోహన్‌సింగ్‌కు భారతరత్న ఇవ్వాలి

(మొదటిపేజీ తరువాయి)



పలు బహుళజాతి సంస్థలు తమ కార్యాలయాలను ప్రారంభించాయని, అమెరికన్ కాన్సులేట్ ఇక్కడి నుంచే కార్యకలాపాలను నిర్వహిస్తోందని తెలిపారు. జెన్-జీ, జెన్-అల్ఫా, జెన్-బీటా తరాలు ఆయన చరిత్ర తెలుసుకోవాలన్న లక్ష్యంతో ఆయనకు నివాళిగా రాష్ట్రానికి ఆర్థికంగా గుండె లాంటి ఈ ప్రాంతంలో విగ్రహ ఆవిష్కరణతో పాటు స్మారక ఉద్యానం ఏర్పాటు చేశామన్నారు. మన్మోహన్ హయాంలో ప్రవేశపెట్టిన సమాచార హక్కు, విద్యా హక్కు, ఉపాధి హామీ పథకాలు సంచలనాలు సృష్టించాయి. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఉపాధి లభించింది. గిరిపుత్రులకు ఎంతో మేలు జరిగింది. 2013లో ప్రవేశపెట్టిన భూసేకరణ, పునరావాస చట్టం చరిత్రలో నిలిచిపోయింది. ఈ చట్టం రాకముందు ప్రాజెక్టుల్లో భూములు కోల్పోయే వారికి మాత్రమే ప్రభుత్వం పరిహారం ఇచ్చేది. చట్టం వచ్చాక ముంపు గ్రామాల్లో ఉన్న ప్రతి ఒక్కరికీ పరిహారం, పునరావాసం లభించింది. విపక్షాలతో సైతం గొప్ప రాజనీతిజ్ఞుడిగా ప్రశంసలు అందుకున్న డాక్టర్ మన్మోహన్‌ను గౌరవించుకోవడం మన బాధ్యత. కేంద్ర ప్రభుత్వం తప్పనిసరిగా ఆయన సేవలను గుర్తించాలి" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆర్థిక మంత్రిగా, ప్రధానమంత్రిగా మన్మోహన్ సమస్యలు పరిష్కరించడంలో కొత్త పద్ధతులు అమలు చేశారని ప్రముఖ ఆర్థిక వేత్త మోహన్ గురుస్వామి అన్నారు. ప్రపంచం కీర్తించిన ప్రముఖ ఆర్థికవేత్త మన్మోహన్ అని జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఎంపీలు వేం నరేందర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యేలు నవీన్ యాదవ్, గాంధీ, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జాయింట్ కమిషనర్ శ్రీవాత్సవ తదితరులు పాల్గొన్నారు.

## ఖైరతాబాద్ ఉపఎన్నికలో పోటీకి రెడీ

(మొదటిపేజీ తరువాయి)



బరిలోకి దించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఫిరాయింపు రాజకీయాలపై కవిత స్పందించారు. ఒక పార్టీ టికెట్‌పై ఎమ్మెల్యేగా గెలిచి, అనంతరం మరో పార్టీలో చేరి వేరే పదవికి పోటీ చేయడం సరైన విధానం కాదని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు దానం నాగేందర్ వ్యవహారాన్ని పరోక్షంగా ప్రస్తావించినవిగా భావిస్తున్నారు. ఓటర్ల జాబితా సవరణ అంశాన్ని కూడా ఆమె ప్రస్తావించారు. క్లరికల్ తప్పుల పేరుతో ఓట్లు తొలగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని, ఈ ప్రక్రియపై ప్రజల్లో అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఖైరతాబాద్ ఉపఎన్నిక నేపథ్యంలో ఓటర్ల జాబితా అంశం ఇప్పటికే రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. తన ఫామ్‌హౌస్‌పై వస్తున్న ఆరోపణలకు కవిత స్పష్టత ఇచ్చారు. తన ఆస్తి కబ్జా, ఇనాం లేదా అసైన్డ్ భూమిలో లేదని, ఎఫ్‌టీఎల్ పరిధిలో కూడా లేదని ఆమె తెలిపారు. ఎన్నికల అఫిడవిట్‌లో తన ఆస్తుల వివరాలను వెల్లడించానని చెప్పారు. ఈ ఆరోపణలు ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డిపై ఆమె ఆరోపణలు చేశారు. ఇక రాష్ట్ర వైద్య రంగంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని కవిత డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ రిమ్స్ ఘటనలను ప్రస్తావిస్తూ ప్రభుత్వ ఆస్పత్రుల పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. ఆరోగ్య పథకాలకు బడ్జెట్, ఆరోగ్యశ్రీ బకాయిలు వంటి అంశాలపై కూడా ఆమె ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రతి జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రులను తెలంగాణ రక్షణ సేన తరఫున సందర్శించి పరిస్థితులను పరిశీలిస్తామని కవిత తెలిపారు. ఇక ఖైరతాబాద్ ఉపఎన్నికే కేంద్రంగా పార్టీ రాజకీయ కార్యాచరణను ముందుకు తీసుకెళ్లనున్నట్లు ఆమె ప్రకటన స్పష్టం చేసింది.

## '10 లక్షల ఎకరాల ఆయిల్‌పామ్ సాగు లక్ష్యం'

(మొదటిపేజీ తరువాయి)



లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం నర్మెట్ట గ్రామంలోని ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను శనివారం మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ శ్రీమతి హైమావతి గారితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ప్లాంట్‌లో జరుగుతున్న సేకరణ, రవాణా, ప్రాసెసింగ్, నీటి లభ్యత, ప్లాంట్ నిర్వహణ, రైతులకు అందుతున్న సేవలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నర్మెట్ట ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ ప్లాంట్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు 70,000 మెట్రిక్ టన్నులకు పైగా ఖీఖీదీను ప్రాసెస్ చేసినట్లు మంత్రి తెలిపారు. ప్రస్తుతం 30 ఖ్రూు సామర్థ్యంతో ప్లాంట్ పూర్తి సామర్థ్యంతో పనిచేస్తోందని చెప్పారు. ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్‌లో ఖీఖీదీ ఉత్పత్తి కూడా భారీగా పెరిగే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. నర్మెట్ట ప్లాంట్‌ను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా 120 ఖ్రూు వరకు విస్తరించుకునే అవకాశం ఉండటం ప్రయోజనకరమన్నారు. రైతులు పండించిన ఆయిల్‌పామ్ ఖీఖీదీను దూర ప్రాంతాలకు తరలించాల్సిన అవసరం లేకుండా, సమీపంలోనే ప్రాసెసింగ్ సదుపాయం అందుబాటులో ఉండటం ఎంతో ప్రయోజనకరమని మంత్రి అన్నారు. కోత అనంతరం సాధ్యమైనంత త్వరగా ప్రాసెసింగ్ ప్లాంట్‌కు తరలించడం ద్వారా నాణ్యతను కాపాడుకోవచ్చని తెలిపారు. రవాణా దూరం, సమయం తగ్గడంతో రైతులకు రవాణా పరంగా కూడా సౌలభ్యం కలుగుతుందని చెప్పారు. ఆయిల్‌పామ్ రైతులకు సమీపంలోనే ప్రాసెసింగ్ సదుపాయాలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, సాగు విస్తరణకు అనుగుణంగా ప్రాసెసింగ్ మౌలిక వసతులను కూడా విస్తరిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

## జమ్మూకశ్మీర్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమే

(మొదటిపేజీ తరువాయి)




ప్రచారాన్ని.. ప్రపంచం ఎప్పటికప్పుడు తిరస్కరిస్తూనే ఉందని పేర్కొంది. ఆ దేశ ఉగ్రవాద చర్యలు, మోసం అందరికీ కనిపిస్తూనే ఉన్నాయని యూఎన్‌లో భారత శాశ్వత మిషన్ ఫస్ట్ సెక్రటరీ పెటల్ గహ్లోత్ పేర్కొన్నారు. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తన ప్రసంగంలో సింధూ జలాల ఒప్పంద ప్రస్తావన తీసుకురావడంతో భారత్ ఈ విధంగా కౌంటర్ ఇచ్చింది. "రెండుదేశాల మధ్య ఉద్రిక్తతలకు.. పాకిస్థాన్ చాలా కాలంగా కొనసాగిస్తున్న సీమాంతర ఉగ్రవాదమే కారణం. ఉగ్రవాదులు పారిపోవడానికి, దాక్కోవడానికి ఎలాంటి చోటు ఉండదని మేం గతేడాది (ఆపరేషన్ సిందూర్‌ను ఉద్దేశిస్తూ) నిరూపించాం. ఉగ్రవాదం నుంచి మా దేశాన్ని రక్షించుకునే హక్కు మాకుంది. పాక్ ప్రవర్తన ఇలాగే ఉంటే.. పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయి. అంతర్జాతీయ వేదికలపై దాయాది అబద్ధపు ప్రచారాన్ని కొనసాగిస్తూనే ఉంది. ఉగ్రవాదం, మోసం, కపటమైన చర్యల వల్ల ఆ దేశానికిగానీ, ప్రపంచానికిగానీ ప్రయోజనం ఉండదు. మతంపట్ల దురభిమానం, ద్వేషం వంటి చెడు లక్షణాల్లో సదీర్ఘ చరిత్ర కలిగిన ఆ దేశం.. భారత్‌పై నిందలేయడం విడ్డూరంగా ఉంది. పాకిస్థాన్ లో మైనారిటీలను ఎలా చూస్తారో యావత్ ప్రపంచానికి తెలుసు. తన సొంత ప్రజలకు వ్యతిరేకంగా తన రాజధాని నగరాన్ని పటిష్టం చేసుకుంటోన్న ఆ ప్రభుత్వం.. ప్రజాస్వామ్య హక్కులు, విలువల గురించి నీతిబోధలు చేస్తోంది. అక్కడ సైన్యానిదే సర్వాధికారం. కీలు బొమ్మలు వస్తారు.. పోతుంటారు. కానీ పెత్తనం ఎవరిదనే విషయంలో ఎలాంటి భ్రమలు అవసరం లేదు" అని పెటల్ గహ్లోత్ దుయ్యబట్టారు. గతేడాది పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేసిన సంగతి తెలిసిందే. షెహబాజ్ షరీఫ్ దానిని ప్రస్తావిస్తూ.. పాకిస్థాన్‌కు కేటాయించిన వాటాను నిలిపివేయడానికి, అడ్డుకోవడానికి, మళ్లించడానికి చేసే ఏ ప్రయత్నాన్నైనా యుద్ధ చర్యగా పరిగణిస్తామని ప్రగల్భాలు పలికారు.

### 'తెలంగాణ తెగువకు నిలువెత్తు రూపం'..

## చాకలి ఐలమ్మ

(మొదటిపేజీ తరువాయి)

ప్రశ్నించడంతో పాటు చట్టబద్ధమైన మార్గంలో కోర్టులను ఆశ్రయించి న్యాయం పొందారని గుర్తుచేశారు. దీనిని ఆమె ప్రజాస్వామిక నిబద్ధతకు నిదర్శనంగా పేర్కొన్నారు. ప్రస్తుత తరానికి ఐలమ్మ జీవితం స్ఫూర్తిదాయకమని కేసీఆర్ అన్నారు. ముఖ్యంగా యువత ఆమె పోరాట పటిమను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. తాను చేపట్టిన మలిదశ తెలంగాణ ఉద్యమంలోనూ ఐలమ్మ పోరాట స్ఫూర్తి అంతర్భాగంగా ఉందని తెలిపారు. ఐలమ్మ చరిత్రను భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆమె జయంతిని అధికారికంగా నిర్వహించే సంప్రదాయాన్ని ప్రారంభించామని కేసీఆర్ వెల్లడించారు. తమ పదేళ్ల పాలనలో మహిళా, శిశు సంక్షేమం, రైతాంగం, కులవృత్తుల అభివృద్ధికి పలు కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. ఐలమ్మ ఆశయాలను గుర్తు చేసుకుంటూ ఆమె పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని కేసీఆర్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

## వ్యవసాయానికి కరెంటు ఏడెనిమిది గంటలేనా?

(మొదటిపేజీ తరువాయి)



చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాళేశ్వరం మోటార్లు ఆన్ చేస్తారా లేదా అని గట్టిగా ప్రశ్నిస్తే.. దెబ్బకు మోటార్లు ఆన్ అయ్యాయని, రంగనాయకసాగర్ జలాశయంలోకి నీళ్లు వస్తున్నాయని తెలిపారు. కాళేశ్వరం కూలిపోయిందని అసత్య ప్రచారం చేసేవాళ్లు రంగనాయకసాగర్‌కు వెళ్లి గోదావరి జలాలను చూడాలన్నారు. జలాల రాకతో చిన్నకోడూరులో రెండు పంటలు పక్కాగా పండుతున్నాయన్నారు. సిద్దిపేట-చిన్నకోడూరు వరకు నాలుగు వరుసల రహదారి సమస్య గురించి అసెంబ్లీలో అడిగినా, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి లేఖలు రాసినా, ఫోన్ చేసినా స్పందన లేదన్నారు. గడీలు, దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా ఎదురొడ్డి పేదల పక్షాన పోరాడిన వీరవనిత ఐలమ్మ అన్నారు. రజకులకు ఉచితంగా 250 యూనిట్ల ఉచిత విద్యుత్తు భారాస ప్రభుత్వం అందజేసి అండగా నిలిచిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మూడేళ్లలో బీసీ కార్పొరేషన్ ద్వారా బడ్జెట్‌లో నిధులు పెడుతున్నప్పటికీ రజకులు, బీసీలకు రూపాయి సాయం అందించలేదన్నారు. విగ్రహ దాతలు కర్నె రవీందర్‌రెడ్డి, గొల్లపల్లి మల్లారెడ్డిని హరీశ్ సన్మానించారు.

## చిట్టీల పేరుతో రూ.10 కోట్లు వసూలు

### పరారీలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు

**సూర్యాపేట:** ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు రూ.10 కోట్ల చిట్టీ డబ్బులతో పరారైన ఘటన సూర్యాపేట(రాబతీఖుజూవ్) జిల్లాలో కలకలం రేపింది. ఆత్మకూర్ (ఎస్) మండలం శెట్టిగూడెం ప్రభుత్వ పాఠశాలలో భానోత్ రాజు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. చిట్టీల పేరుతో చివ్వెంల మండలం లక్ష్మీనాయక్ తండా, బోట్య తండా, ఏనెగంటి తండా, శెట్టిగూడెం, పిల్లలమర్రి తదితర గ్రామాల్లో వందలాది మంది నుంచి దాదాపు రూ.10కోట్లు వసూలు చేశాడు. పది రోజులుగా ఇంటికి తాళం వేసి ఉండటం, ఫోన్ స్విచ్ఛాఫ్ కావడంతో బాధితులు ఆందోళనకు గురయ్యారు. శనివారం సూర్యాపేట జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. బంధువుల నుంచే రాజు రూ.2కోట్లు వసూలు చేసినట్టు సమాచారం. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఆర్టీసీ కార్మిక సంఘాలకు ఎన్నికల గుర్తుల కేటాయింపు

**హైదరాబాద్:** తెలంగాణ ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికల ప్రక్రియలో భాగంగా పలు సంఘాలకు గుర్తింపులను కేటాయిస్తూ రాష్ట్ర కార్మికశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్టీసీ సామాజిక తెలంగాణ మజ్దూర్ యూనియన్‌కు- బతుకమ్మ, ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ ఏ4528కు - నిచ్చెన, బహుజన వర్కర్స్ యూనియన్ - కత్తెర, ఎంప్లాయీస్ యూనియన్ - బస్సు, కార్మిక పరిషత్ - బస్సు టైరు, కార్మిక సంఘ్ - పులి, బహుజన కార్మిక యూనియన్ - ధర్మచక్రం, ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ - బాణం విల్లు, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ - నక్షత్రం, నేషనల్ మజ్దూర్ యూనియన్ - కాగడా చేయి, స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ - త్రాసు, తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ - గద గుర్తులను కేటాయించారు. అక్టోబరు 9న ఎన్నికలు జరగనున్నాయి.



## ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న జర్నలిస్టులకు కిషన్‌రెడ్డి అభినందనలు

- మేకలమండి పాఠశాలను 10వ తరగతి వరకు అప్‌గ్రేడ్ చేయాలి
- పాఠశాల అభివృద్ధి కమిటీకి కిషన్‌రెడ్డి హామీ
- విద్యార్థుల భవిష్యత్తు కోసం ముందడుగు

**సికింద్రాబాద్, నేడు న్యూస్:** ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కోసం సమాజహితం దృష్టితో కృషి చేస్తున్న జర్నలిస్టులను కేంద్ర గనుల శాఖ మంత్రి జీ. కిషన్‌రెడ్డి అభినందించారు. సమాజ ప్రయోజనం కోసం పనిచేసే ఇలాంటి జర్నలిస్టులు అరుదుగా ఉంటారని ఆయన కొనియాడారు. శనివారం బోయిగూడలోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు ఈ. చంద్రశేఖర్ (సాక్షి), వీ.జే. శేషగిరిరావు (ఆంధ్రజ్యోతి), కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా పాఠశాలను 10వ తరగతి వరకు అప్‌గ్రేడ్ చేసేందుకు సహకరించాలని తల్లిదండ్రులు, విద్యార్థుల తరఫున పాఠశాల అభివృద్ధి కమిటీ విజ్ఞప్తి చేసింది. దీనిపై స్పందించిన కిషన్‌రెడ్డి.. పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం తప్పకుండా అందిస్తానని తెలిపారు. పేద విద్యార్థులు ఉన్నత పాఠశాల వరకు చదువుకునేందుకు స్థానికంగా హైస్కూల్ అవసరమని పేర్కొన్నారు. పాఠశాలను పదో తరగతి వరకు అప్‌గ్రేడ్ చేసే అంశంపై విద్యాశాఖ ఉన్నతాధికారులకు తాను కూడా సిఫారసు చేస్తానని హామీ ఇచ్చారు. పాఠశాల అభివృద్ధి కోసం కమిటీ చేస్తున్న కృషిని ఆయన అభినందించారు.



## ఖైత్లాపూర్‌లో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

**కూకట్ పల్లి, నేడు న్యూస్:** కూకట్పల్లి అసెంబ్లీ పరిధిలోని ఖైత్లాపూర్ డివిజన్ నందు భారతీయ జనతా పార్టీ కూకట్పల్లి అసెంబ్లీ ఓబిసి మోర్చా కన్వీనర్ వినోద్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కూకట్పల్లి అసెంబ్లీ బిజెపి ఇంచార్జ్ మాధవరం కాంతారావు, విశేష అతిథిలుగా మూసాపేట్ డివిజన్ కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్, బీజేపీ ఓబీసీ మోర్చా మేడ్చల్ అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గండోళ్ల సతీష్ గౌడ్ హాజరై ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ చాకలి ఐలమ్మ భూస్వామ్య దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప వీరవనిత అని, అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. ఆమె చూపిన ధైర్యసాహసాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, ఆమె ఆశయాలను కొనసాగిస్తూ సామాజిక న్యాయం, సమానత్వం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఓ బి సి మోర్చా నాయకులు రేణుక, దిలీప్ , యాదయ్య, డివిజన్ అధ్యక్షులు వేణుగోపాల్ , రేణుక,ప్రేమ్,సూరి బాబు, బిజెపి కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




## విద్యార్థి ఉద్యమానికి ఏఐఎస్ఎఫ్ దిక్సూచి

### స్వాతంత్ర్య సంగ్రామం నుంచి తెలంగాణ ఉద్యమం వరకు 90 ఏళ్ల అలుపెరగని పోరాట ప్రస్థానం

**కారేపల్లి, నేడు న్యూస్:** స్వాతంత్ర్య సంగ్రామంలో విప్లవ స్ఫూర్తిని రగిలించి, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన తొలి, మలి దశ ఉద్యమాల్లో వీరోచితంగా పోరాడిన ఘన చరిత్ర ఏఐఎస్ఎఫ్‌కు ఉందని ఆ సంఘం ఖమ్మం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిన్నంశెట్టి ఆకాష్ అన్నారు. విద్యార్థుల హక్కులు, విద్యారంగ పరిరక్షణ కోసం 90 ఏళ్లుగా నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ ఉద్యమ స్ఫూర్తిని నేటి విద్యార్థులు కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. కారేపల్లి మండల కేంద్రంలోని గిరి ప్రసాద్ భవన్‌లో శనివారం ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాల ముగింపు కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ నెల 28, 29, 30 తేదీల్లో హనుమకొండలో నిర్వహించనున్న ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాల ముగింపు కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆకాష్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం జరిగిన పోరాటంలో విద్యార్థులను ఉద్యమబాట పట్టించిన తొలి విద్యార్థి సంఘంగా ఏఐఎస్ఎఫ్‌కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో పాటు తెలంగాణ ఉద్యమ వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని, నేటికీ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సంఘం నిరంతరం పోరాడుతోందన్నారు. మెకాలే విద్యా విధానానికి వ్యతిరేకంగా, విద్యారంగంలో సమూల సంస్కరణల కోసం ఏఐఎస్ఎఫ్ ఉద్యమాలు నిర్వహించిందన్నారు. కొఠారి కమిషన్ సిఫారసుల అమలు కోసం కూడా విద్యార్థులను సమీకరించి పోరాటాలు చేపట్టిన ఘనత ఏఐఎస్ఎఫ్‌దేనని పేర్కొన్నారు. చదువుతూ పోరాడు.. చదువు కోసం పోరాడు' అనే నినాదంతో విద్యార్థుల విద్యా హక్కుల పరిరక్షణకు అనేక ఉద్యమాలు నిర్వహించిందన్నారు. విశ్వవిద్యాలయాల్లో మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటాలు చేయడంతో పాటు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పెంపు కోసం ఉద్యమాలు చేపట్టిందని తెలిపారు. మహిళలపై జరుగుతున్న దాడులు, అశ్లీల సాహిత్యానికి వ్యతిరేకంగా కూడా ఏఐఎస్ఎఫ్ పోరాటాలు నిర్వహించిందన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని, తెలంగాణ ఉద్యమ వారసత్వాన్ని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు సమాజంలో నెలకొన్న సమస్యలపై ప్రశ్నించే గొంతుకగా ఎదగాలని ఆకాష్ సూచించారు. విద్యార్థి ఉద్యమాల ద్వారా దేశానికి అనేక మంది ప్రముఖ నాయకులు, మేధావులు అందించబడ్డారని, ఏఐఎస్ఎఫ్ 90 ఏళ్ల ప్రస్థానం త్యాగాలు, పోరాటాలతో ముడిపడి ఉందని ఆయన అన్నారు. హనుమకొండలో నిర్వహించనున్న 90వ వార్షికోత్సవాల ముగింపు కార్యక్రమాలను విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అణిచివేతకు వ్యతిరేకంగా పోరాడిన అసాధారణ మహిళ చాకలి ఐలమ్మ

- నివాళి అర్పించిన కలెక్టర్ మను చౌదరి
- కలెక్టరేట్ లో చాకలి ఐలమ్మ జయంతి
- పాల్గొన్న అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు



**మేడ్చల్, నేడు బ్యూరో:** చాకలి ఐలమ్మ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని, సామాజిక అన్యాయం, దోపిడీ, దౌర్జన్యం, అణచివేతకు వ్యతిరేకంగా ఆమె ధైర్యంగా పోరాడారని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. ఆమె సాధారణ కుటుంబంలో జన్మించినప్పటికీ, అసాధారణమైన ధైర్య సాహసాలను ప్రదర్శించారన్నారు. ఆమె ప్రజల హక్కుల సాధన కోసం ధైర్యంగా నిలబడిన గొప్ప మహిళగా చరిత్రలో నిలిచారని కలెక్టర్ మను చౌదరి అన్నారు. జిల్లా కలెక్టరేట్ లో



శనివారం వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మను చౌదరి జ్యోతి ప్రజ్వలన చేసి చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, చాకలి ఐలమ్మ జీవితం మనకు ధైర్యం, ఆత్మవిశ్వాసం, సామాజిక న్యాయం, సమానత్వం వంటి విలువలను నేర్పుతుందన్నారు. ముఖ్యంగా మహిళలు ఎలాంటి పరిస్థితుల్లోనైనా ధైర్యంగా ముందుకు సాగాలని స్ఫూర్తిని స్తుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. విజయేందర్ రెడ్డి, రెవెన్యూ ఆఫీసర్ ఎస్.మాలతి, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిని ఝాన్సీ రాణి, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి వినోద్ కుమార్. ఏ.ఓ కె.వి.వి. సీతారాం, సహాయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి గంగాధర్, రజక సంఘం నాయకులూ పంజాగారు అంజయ్య, సాంబరాజ్ కుమార్, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, బి.సి. కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### 27న కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి ఉత్సవం :

ఈ నెల 27 న ఆదివారం ఉదయం 11:00 గంటలకు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు నిర్వహించనున్నామని బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఝాన్సీ వెల్లడించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, బి.సి. సంఘాల నాయకులు, పద్మశాలి కుల సంఘాల నాయకులు, వివిధ కులాల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, జిల్లా ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

## రక్తపాతంతో ముగిసిన పూజ

- భార్య, ఇద్దరు పురోహితుల హత్య
- పిల్లలను బందీలుగా ఉంచి 7 గంటల ఉత్కంఠభరిత హైడ్రామా

**హైదరాబాద్, నేడు ప్రతినిధి:** కుటుంబంలో శాంతి నెలకొనాలని నిర్వహించిన పూజా కార్యక్రమం క్షణాల్లో రక్తపాతంగా మారిన ఘటన ఉత్తరప్రదేశ్‌లోని ఆజంగఢ్ జిల్లాలో సంచలనం సృష్టించింది. భార్య ఏర్పాటు చేసిన శాంతి పూజను వ్యతిరేకించిన ఓ వ్యక్తి, ఆగ్రహావేశంలో భార్యతో పాటు ఇద్దరు పురోహితులను కాల్చి చంపాడు. అంతటితో ఆగకుండా తన ముగ్గురు పిల్లలను బందీలుగా ఉంచి ఏడు గంటలపాటు పోలీసులకు సవాల్ విసిరాడు. అహ్రౌలా పోలీస్‌స్టేషన్ పరిధిలోని శంభుపూర్ గ్రామంలో మంగళవారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. స్థానికుడు అరవింద్ సింగ్ మద్యపాన వ్యసనం, అసాధారణ ప్రవర్తనతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. ఇంట్లో ప్రశాంత వాతావరణం నెలకొనాలని భావించిన అతని భార్య బబిత ఇద్దరు పురోహితులను పిలిపించి శాంతి పూజ ఏర్పాటు చేసింది. సాయంత్రం ఇంటికి చేరుకున్న అరవింద్, అక్కడ జరుగుతున్న పూజను చూసి తీవ్ర ఆగ్రహానికి లోనయ్యాడు. పురోహితులను ప్రశ్నిస్తూ వారి గుర్తింపు వివరాలు అడిగాడు. మాటామాటా పెరిగిన వాగ్వాదం కొద్ది నిమిషాల్లోనే భయానక మలుపు తిరిగింది. ఒక్కసారిగా తన వద్ద ఉన్న లైసెన్స్ పిస్టల్‌ను బయటకు తీసిన అరవింద్, విచక్షణ కోల్పోయి కాల్పులు ప్రారంభించాడు. మొదటి బుల్లెట్ భార్య బబితను తాకింది. ఆ తర్వాత పూజ నిర్వహిస్తున్న ఇద్దరు పురోహితులు మహేంద్ర పాఠక్, అఖిలేశ్ మిశ్రాలపై కూడా వరుసగా కాల్పులు జరిపాడు. ఇంటి ఆవరణ క్షణాల్లో రక్తంతో తడిసిపో యింది. శాంతి మంత్రాలు వినిపించిన ఆ ఇల్లు, ఆర్తనా దాలతో మార్మోగిపోయింది. హత్యల అనంతరం అరవింద్ తన ముగ్గురు పిల్లలను తీసుకుని ఇంట్లోని ఒక గదిలోకి వెళ్లి తలుపులు బిగించుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు, స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ సిబ్బంది భారీగా అక్కడికి చేరుకున్నారు. పిల్లలను కాపాడేందుకు తీవ్ర ఉత్కంఠభరితమైన చర్చలు ప్రారంభమయ్యాయి. అయితే లొంగిపోవాలన్న పోలీసుల విజ్ఞప్తిని అరవింద్ పట్టించుకోలేదు. గంటలు గడుస్తుండగా ఉద్రిక్తత మరింత పెరిగింది. ఆ సమయంలో అతను గదిలో ఉన్న ఒక చిన్నారిపైనే కాల్పులు జరిపినట్లు అధికారులు తెలిపారు. అనంతరం పోలీసులపై కూడా కాల్పులకు దిగడంతో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది.

### రంగంలోకి దిగిన ప్రత్యేక బృందాలు

పిల్లల ప్రాణాలను రక్షించేందుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. టియర్ గ్యాస్ ప్రయోగించి గదిలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించాయి. ఇరు వైపులా కాల్పులు చోటుచేసుకోవడంతో ఏడు గంటలపాటు కొనసాగిన ఉత్కంఠ, చివరకు ఎదురుకాల్పులతో ముగిసింది. తీవ్రంగా గాయపడిన అరవింద్‌ను అదుపులోకి తీసుకుని ఆసుపత్రికి తరలించారు. కాల్పుల్లో గాయపడిన చిన్నారిని కూడా చికిత్స కోసం చేర్చారు. అయితే ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇద్దరూ ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు వెల్లడించారు. మిగిలిన ఇద్దరు పిల్లలను సురక్షితంగా రక్షించారు. ఒక కుటుంబానికి శాంతిని తీసుకురావాలని ప్రారంభమైన పూజ, క్షణికావేశం, కోపం, మానసిక అస్థిరతల కారణంగా ఘోర విషాదంగా మారింది. భార్య, ఇద్దరు పురోహితులు, అనంతరం ఒక చిన్నారి ప్రాణాలు కోల్పోవడంతో ఈ సంఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపుతోంది. కుటుంబ వివాదాలు, మద్యపాన వ్యసనం, అదుపు తప్పిన ఆవేశం కలిసి ఎంతటి విధ్వంసానికి కారణమవుతాయో ఈ ఘటన మరోసారి విషాదకరంగా చాటి చెప్పింది.




## గ్రామాభివృద్ధికి పక్కా ప్రణాళిక రూపొందించాలి

### ఉపాధి హామీ పనుల గుర్తింపుపై సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ

**కారేపల్లి. నేడు న్యూస్:** గ్రామాల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను గుర్తించి, ప్రాధాన్యత క్రమంలో పంచాయతీ ప్రణాళిక రూపొందించాలని పంచాయతీరాజ్ అధికారులు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఖమ్మం జిల్లా భక్త రామదాసు కళాక్షేత్రంలో వికసిత్ భారత్--పంచాయతీ ప్లాన్, వీబీజీ రాంజీ కార్యక్రమంలో భాగంగా సర్పంచులు, కార్యదర్శులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అక్టోబర్ నుంచి జూన్ వరకు ఉపాధి హామీ కూలీలకు పని కల్పించేలా గ్రామాల్లో అవసరమైన పనులను గుర్తించి ప్రణాళికలో పొందుపరచాలని సూచించారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి పనులకు సంబంధించిన ప్రతిపాదనలు, దరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు. ఈ సందర్భంగా సింగరేణి మండలం గాదెపాడు గ్రామపంచాయతీ సర్పంచ్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు భూక్య రంజిత్ కుమార్ సర్పంచుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సర్పంచులకు పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల వేతనాలను విడుదల చేయడంతో పాటు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు, మెటీరియల్ పేమెంట్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీ పనుల బిల్లులను త్వరితగతిన విడుదల చేయాలని కోరారు. ఉపాధి హామీ కింద కొత్త పనులను త్వరగా మంజూరు చేసి కూలీలకు నిరంతరం ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు నరహరి బాబు ఆధ్వర్యంలో కూడా జిల్లాలోని సర్పంచుల సమస్యలను డిప్యూటీ పంచాయతీరాజ్ కమిషనర్ విద్యాలత దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను పరిశీలించి త్వరలో పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీపీఓ, డీఆర్‌డీఓ, డీఎల్‌పీఓలు, మాస్టర్ ట్రైనర్లు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


## సేవా సంకల్ప్ అభియాన్‌లో ఉచిత వైద్య శిబిరం




**సికింద్రాబాద్, నేడు న్యూస్:** సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని సికింద్రాబాద్, కంటోన్మెంట్ కర్ఖానాలోని ఆర్‌కే ఫౌండేషన్‌లో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం, నిత్యావసర వస్తువుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ బీజేపీ స్టేట్ మెడికల్ సెల్ ఆధ్వర్యంలో డాక్టర్ రామకృష్ణ సహకారంతో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ. కిషన్‌రెడ్డి, మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు బానుక నర్మద మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు. అవసరంలో ఉన్న నిరుపేదలు, రోగులకు సేవలందించే లక్ష్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో ఉచిత వైద్య సలహాలు, మందులు, పండ్లు, పోషకాహార సహాయం అందించారు. అలాగే అవసరమైన వారికి డార్మిటరీ సదుపాయం, నిత్యావసర వస్తువులు, వైద్య పరికరాల సహాయం అందించే ఏర్పాట్లు చేశారు. ప్రజలకు ఆరోగ్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేదలకు అండగా నిలవడమే సేవా సంకల్ప్ అభియాన్ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

## టీజీసీఎంఎఫ్‌సీ మేడ్చల్ కో-ఆర్డినేటర్‌గా ఆరె పవన్ కల్యాణ్

### కార్మికుల సంక్షేమానికి చేసిన సేవలకు గుర్తింపుగా నియామకం



**మేడ్చల్, నేడు న్యూస్:** తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ (టీజీసీఎంఎఫ్‌సీ) మేడ్చల్ అసెంబ్లీ కోఆర్డినేటర్‌గా ఆరె పవన్ కల్యాణ్ నియమితులయ్యారు. జీహెచ్ఎంసీ ట్రేడ్ యూనియన్ నగర అధ్యక్షుడిగా కార్మికుల సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించారు. ట్రేడ్ యూనియన్ నాయకుడిగా పవన్ కల్యాణ్ కార్మికుల హక్కులు, వారికి అందాల్సిన సౌకర్యాల కోసం నిరంతరం కృషి చేశారు. కార్మికుల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ వారి సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆయన చురుకైన నాయకత్వాన్ని గుర్తించి మేడ్చల్ అసెంబ్లీ కోఆర్డినేటర్‌గా నియమించారు.

### మరింత బాధ్యతతో పనిచేస్తా: పవన్ కల్యాణ్

ఈ సందర్భంగా ఆరె పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజాపాలనలో అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతోందని హర్షం వ్యక్తం చేశారు. ప్రజాపాలనకు ప్రజల నుంచి పెద్దఎత్తున మద్దతు లభిస్తోందని పేర్కొన్నారు. తనకు అప్పగించిన ఈ పదవి మరింత బాధ్యతను పెంచిందని, బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. క్రిస్టియన్ మైనారిటీల సంక్షేమం, వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన టీజీసీఎంఎఫ్‌సీ చైర్మన్, సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు దీపక్ జాన్‌కు పవన్ కల్యాణ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## సీఈసీ వెంటనే రాజీనామా చేయాలి

- సిపిఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు ఉమా, సత్యంల డిమాండ్
- జ్ఞానేష్ దిష్టిబొమ్మ దగ్ధం

**మేడ్చల్, నేడు బ్యూరో:** భారత ఎన్నికల కమిషన్ స్వతంత్రతను, ప్రజాస్వామికరణను బలహీనపరిచి, నియంతృత్వంగా నిర్ణయాలు తీసుకుంటున్నటువంటి ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని సిపిఐ, సిపిఐ (ఎం ) లు డిమాండ్ చేశాయి. శనివారం సిపిఐ, (సిపిఐ ఎం) సీ.ఈ.సీ జ్ఞానేశ్వర్ రాజీనామాను కోరుతూ, ఆయన దిష్టిబొమ్మను మేడ్చల్ జిల్లా షాపూర్ నగర్ సాగర్ హోటల్ వద్ద దగ్ధం చేశాయి. ఈ సందర్భంగా ఉమా మహేష్, సత్యంలు మాట్లాడుతూ, బిజెపి అధికారంలోకి వచ్చాక దేశంలోని ఈడీ, సిబిఐ, ఎన్నికల కమిషన్ లు స్వతంత్రతను కోల్పోయి, అధికార మోడీ, అమిత్ షాల చెప్పుచేతుల్లో నడుస్తున్నట్టు, గత కొద్ది సంవత్సరాలుగా జరుగుతున్నటువంటి పరిణామాలు ఉదాహరణలుగా కనిపిస్తున్నాయన్నారు. ఎన్నికల కమిషన్ సమావేశాల్లో, ఇతర ఎన్నికల కమిషనర్లు గత 14 సమావేశాల్లో 10 సార్లు వ్యతిరేకించినప్పటికీ పరిగణలోకి తీసుకోకుండా జ్ఞానేశ్వర్ కుమార్ తన ఏకచత్రాధిపత్యం నిర్ణయాలను తీసుకున్నట్లు స్పష్టంగా తెలుస్తున్నదన్నారు. ఇది దేశ ప్రజాస్వామ్య హక్కులను, ప్రభుత్వ సంస్థల స్వతంత్రతను దెబ్బతీసినట్టేనని, అందువల్ల రాజ్యాంగ హక్కులను ఉల్లంఘించినటువంటి జ్ఞానేశ్వర్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంటనే రాజీనామా చేయకపోతే మరో ఉద్యమాన్ని చవిచూడాల్సి వస్తుందన్నారు. మోదీ, అమిత్ షా, బీజేపీ నాయకులు నీతిగల వారైతే, రాజ్యాంగాన్ని కాపాడుతున్న వారైతే వెంటనే జ్ఞానేశ్వర్ తో రాజీనామా చేయించి, ప్రజల ఓట్లను తిరస్కరిస్తున్నటువంటి సర్ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి సిపిఐ మండల కార్యదర్శి స్వామి, సహాయ కార్యదర్శి రాములు, బక్కరి మల్లేష్ రమేష్ గౌరీ, శ్రీనివాస్, సిపిఎం నాయకులు రాజశేఖర్, అంజయ్య, శ్రీనివాసు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలి

**సికింద్రాబాద్, నేడు న్యూస్:** దొరల పెత్తనం, భూస్వాములు, రజాకార్ల అరాచక వ్యవస్థకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి, వెనుకబడిన వర్గాల హక్కుల కోసం పోరాడిన ధీరవనిత చాకలి ఐలమ్మ అని కంటోన్మెంట్ బోర్డు మాజీ వైస్ చైర్మన్ జంపన ప్రతాప్ అన్నారు. చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని బోయిన్‌పల్లి రజక సంఘం భవనంలో ఆమె చిత్రపటానికి జంపన ప్రతాప్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐలమ్మ పోరాట పటిమ, ధైర్యసాహసాలను ఆయన స్మరించుకున్నారు. ఆమె ఆశయాలు, పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వారికి జంపన ప్రతాప్ ఫ్రూట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బోయిన్‌పల్లి రజక సంక్షేమ సంఘం సభ్యులు జంపన ప్రతాప్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నర్సింగ్‌రావు, బాల్రాజు, రాములు, భుజంగర్, జాంగీర్‌తో పాటు స్థానికులు వరప్రసాద్, ముఖేష్ యాదవ్, ఓం ప్రకాష్ యాదవ్ పాల్గొన్నారు.



## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి తరతరాలకు ఆదర్శం : ఎమ్మెల్యే శ్రీ గణేష్

**సికింద్రాబాద్, నేడు న్యూస్:** నైజాం భూస్వామ్య వ్యవస్థను, దొరల అరాచకాలను ధైర్యంగా ఎదిరించి తన హక్కుల రక్షణ కోసం పోరాడిన తెలంగాణ విప్లవ వీరనారి చాకలి ఐలమ్మ అని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా కంటోన్మెంట్‌లోని మడ్‌ఫోర్ట్ ధోబీఘాట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీ గణేష్ పాల్గొని ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ చూపిన తెగువ, ధైర్యం తరతరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. స్త్రీ శక్తికి, ఆత్మగౌరవానికి ఐలమ్మ నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఐలమ్మకు అందించే నిజమైన నివాళి అని అన్నారు. చాకలి ఐలమ్మ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని తెలిపారు. కోఠి మహిళా కళాశాలకు చాకలి ఐలమ్మ పేరు పెట్టి ఆమె స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లేలా చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు, ఐలమ్మ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆమెకు ఘనంగా నివాళులర్పించారు.



## చాకలి ఐలమ్మ జయంతి వేడుక

### డబిల్‌పూర్ రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ జయంతి వేడుక

**మేడ్చల్, నేడు న్యూస్:** ఎల్లంపేట్ మున్సిపల్ పరిధిలోని డబిల్‌పూర్ గ్రామంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను గ్రామ రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎల్లంపేట్ మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్ ఎర్రవల్లి విఘ్నేశ్వర్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ సంజీవరావు హాజరై ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ చేసిన సేవలు, సాహసాలు చిరస్మరణీయమని కొనియాడారు. దొరల అరాచకాలకు, నిజాం రజాకార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం తరతరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీరామ్ రెడ్డి, భవాని వెంకటేష్ యాదవ్, బేగారి సురేష్, ఇమ్రాన్, గ్రామ రజక సంఘం సభ్యులు మునిగొండ శేఖర్, అశోక్, రాజు, నరసింహ, శ్రీనివాస్, మురళి, సదానంద్, నవీన్, సోను, కిరణ్ పాల్గొన్నారు.



## గుండ్లపోచంపల్లిలో సేవా సంకల్ప అభియాన్

### ఉపాధ్యాయులకు సన్మానం, విద్యార్థులకు పండ్లు, బిస్కెట్ల పంపిణీ

**మేడ్చల్, నేడు న్యూస్:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్యమంత్రిగా ప్రధానమంత్రిగా 25 ఏళ్ల ప్రజా సేవను పూర్తి చేసుకుంటున్న సందర్భంగా నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప అభియాన్'లో భాగంగా గుండ్లపోచంపల్లి డివిజన్‌లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. డివిజన్ కన్వీనర్ చింతలపూడి రామారావు ఆధ్వర్యంలో గుండ్లపోచంపల్లి డివిజన్‌లోని పాఠశాలలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కామారెడ్డి ఇన్‌చార్జి పట్లోళ్ల విక్రంరెడ్డి, మేడ్చల్ రూరల్ ప్రధాన కార్యదర్శి అమరం మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా ప్రజల మధ్య సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు పునాది స్తంభాలని, వారి త్యాగం, అంకితభావం వల్లే భావితరాలు ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, అమరం సరస్వతి, డివిజన్ అధ్యక్షుడు కావేరి శ్రీధర్ ముదిరాజ్, ప్యాక్స్ మాజీ చైర్మన్ జైతువాళ్ల కిషన్, ప్రధాన కార్యదర్శి జైతువాళ్ల కృష్ణ, మహిళా మోర్చా అధ్యక్షురాలు బట్టికాడి నవనీత, సోషల్ మీడియా ఇన్‌చార్జి ప్రవీణ్ గౌడ్, బూత్ అధ్యక్షులు ఎస్. నవీన్, అభిలాష్, పాండు తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి నిధులు కేటాయించాలి

### కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డికి వినతిపత్రం అందజేసిన డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్



**బోడుప్పల్, నేడు న్యూస్:** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్, ఘట్కేసర్ సర్కిల్‌లలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన నిధులు కేటాయించాలని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వద్వేష్ యాదవ్ మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని కోరారు. ఈ మేరకు శనివారం మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ మల్కాజ్‌గిరి కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. బోడుప్పల్, ఘట్కేసర్ సర్కిళ్ల పరిధిలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, రహదారులు, డ్రైనేజీ, పార్కులు, పారిశుధ్యం, ఓపెన్ జిమ్‌లు తదితర అభివృద్ధి పనులకు ప్రాధాన్యతనిస్తూ నిధులు మంజూరు చేయాలని వజ్రేష్ యాదవ్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని కోరారు. ప్రజల సమస్యలను దృష్టిలో పెట్టుకుని పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు, అవసరమైన ప్రాంతాల్లో కొత్త అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి నిధులు కేటాయించాలని వజ్రేష్



యాదవ్ విజ్ఞప్తి చేశారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, మల్కాజ్‌గిరి కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి పనులకు అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేసి, నిధులు మంజూరయ్యేలా పాటుపడతానని వజ్రేష్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ పరిధిలోని ఆయా ప్రాంతాల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎదులాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సామల అమర్, మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి, ఘట్కేసర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొక్క ప్రభాకర్ రెడ్డి, నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భూమయ్య యాదవ్, ఘట్కేసర్ మాజీ చైర్మన్ మల్లి పావని జంగయ్య యాదవ్, విశ్వనాథం, ఉదయ్ కుమార్ రెడ్డి, జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో ముగిసిన గణపతి ఉత్సవాలు

### మేడిపల్లి సాయి హిల్స్ కాలనీలో ఘనంగా గణపతి నిమజ్జన వేడుకలు

**మేడిపల్లి, నేడు న్యూస్:** డివిజన్ పరిధిలోని సాయి హిల్స్ కాలనీలో గత పదకొండు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న శ్రీ గణనాథుని నిమజ్జన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గణపతి మండపంలో లడ్డు వేలాన్ని నిర్వహించారు. శ్రీ గణపతి స్వామివారి పవిత్ర లడ్డూను ₹95వేలకు సామ వెంకట్ రెడ్డి– వసంత దక్కించుకోగా, స్వామివారి పవిత్రమైన కలశంను ₹68వేలకు మూల మణిదీప్ రెడ్డి దక్కించుకున్నారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి, కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు, ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి లడ్డూ,



కలశంలను విజేతలకు అందజేశారు. అనంతరం నిర్వహించిన గణపతి నిమజ్జన కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి ఘనంగా వీడ్కోలు పలికారు.

## ఈసీఐఎల్‌లో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

### భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం ఐలమ్మ పోరాటం చిరస్మరణీయం

**ఈసీఐఎల్, నేడు న్యూస్:** తెలంగాణ సాయుధ పోరాటంలో ధైర్యసాహసాలతో ప్రజల్లో చైతన్యం రగిలించిన వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను తెలంగాణ రజక సమితి ఆధ్వర్యంలో ఈసీఐఎల్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు బేతి సుభాష్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం చిరస్మరణీయమని అన్నారు. తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన ధీరవనితగా ఐలమ్మ నిలిచారని పేర్కొన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఐలమ్మ చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఐలమ్మ చేసిన పోరాటాన్ని స్మరించుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని





పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చైర్మన్ తాడూరు శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు ప్రభుదాస్, పజ్జూరి పావని మణిపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శివ, పాండాల శివకుమార్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వి.ఎస్. బోస్, జిల్లా కార్యవర్గ సభ్యులు దామోదర్‌రెడ్డి, ధర్మేంద్ర, సత్యప్రసాద్, నరసింహ, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్, యాదగిరిరావు, కాప్రా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మెరుగు చంద్రమోహన్, నాయకులు కొత్త అంజిరెడ్డి, కాసం మహిపాల్‌రెడ్డి, మర్రి మోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీకాంత్, ఏనుగు సీతారాంరెడ్డి, నీరుకొండ సతీష్‌బాబు, వెంకట్, ఎస్.ఎ. రహీం, జయరాం, యాకయ్య తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ రజక సమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శనిగరం అశోక్, రాష్ట్ర అధ్యక్షుడు ముంజంపల్లి రాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుమ్మడి రాజు సోమయ్య, రాష్ట్ర కార్యదర్శి సకినాల రవి, రాష్ట్ర కోశాధికారి జంజీరాల సత్యనారాయణ, రత్నాల కనకయ్య, కర్ణాకర్, కొమురయ్య, నరేష్, సాయి లింగన్న, కుమార్‌స్వామి, రాజిరెడ్డి, రాజు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## మెడినోవా హాస్పిటల్‌లో అరుదైన శస్త్రచికిత్స

- లేజర్ చికిత్సతో చిన్నారికి ఉపశమనం
- ఐదేళ్ల చిన్నారి మూత్రనాళంలోని రాయి తొలగింపు
- డా. నితేష్ బత్తాల ఆధ్వర్యంలో విజయవంతమైన చికిత్స

**మేడ్చల్, నేడు న్యూస్:** ఐదేళ్ల చిన్నారి మూత్రనాళంలో ఏర్పడిన 10ఐ8 మి.మీ. రాయిని మెడినోవా హాస్పిటల్ వైద్యులు విజయవంతంగా తొలగించారు. కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డా. నితేష్ బత్తాల ఆధ్వర్యంలో ఆధునిక వైద్య విధానంతో శస్త్రచికిత్స నిర్వహించారు. చికిత్స అనంతరం చిన్నారి ఆరోగ్యం మెరుగుపడటంతో వైద్యులు డిశ్చార్జి చేశారు. మెదక్ పట్టణానికి చెందిన ఐదేళ్ల చిన్నారి కుడివైపు నడుము నొప్పి, మూత్ర విసర్జన సమయంలో మంట, వికారం, వాంతులతో బాధపడుతూ మెడినోవా హాస్పిటల్‌ను సంప్రదించింది. వైద్యులు నిర్వహించిన పరీక్షల్లో కుడివైపు మూత్రనాళం మూత్రాశయంతో కలిసే ప్రాంతంలో 10ఐ8 మి.మీ. పరిమాణంలో రాయి ఉన్నట్లు గుర్తించారు. సాధారణంగా మూత్రపిండాల్లో ఏర్పడిన రాయి మూత్రనాళం గుండా కిందికి వచ్చి అక్కడ ఇరుక్కుపోవడంతో ఈ సమస్య ఏర్పడినట్లు వైద్యులు నిర్ధారించారు. చిన్న వయసులో ఇంత పెద్ద పరిమాణంలో రాయి ఏర్పడటంతో మూత్ర ప్రవాహానికి అడ్డంకి ఏర్పడి ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని గుర్తించారు.

### లేజర్ చికిత్సతో రాయి తొలగింపు



చిన్నారి ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వైద్యులు తక్షణమే శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించారు. డా. నితేష్ బత్తాల ఆధ్వర్యంలో యూరెటెరోస్కోప్, లేజర్ లిథోట్రిప్సీ విధానాల ద్వారా మినిమల్లీ ఇన్వేసివ్ శస్త్రచికిత్స నిర్వహించారు. ఈ ప్రక్రియలో రాయిని పూర్తిగా తొలగించి, మూత్ర ప్రవాహం సజావుగా సాగేందుకు డీజే స్టెంట్‌ను అమర్చారు. చికిత్స విజయవంతం కావడంతో చిన్నారి ఆరోగ్యం క్రమంగా మెరుగుపడింది. అనంతరం వైద్యులు చిన్నారిని ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారు.

### లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయొద్దు

చిన్న వయసులోనే నడుము నొప్పి, మూత్ర విసర్జన సమయంలో మంట, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించి అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ నితేష్ బత్తాల సూచించారు.



## ఎల్లంపేట్‌లో బీజేపీ 'అంగన్ మిలాన్' సేవా కార్యక్రమం

### అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన.. టీచర్లు, ఆశా వర్కర్లకు ఘన సన్మానం

**మేడ్చల్, నేడు న్యూస్:** ఎల్లంపేట్ మున్సిపల్ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'అంగన్ మిలాన్' సేవా కార్యక్రమంలో భాగంగా ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని ఎల్లంపేట్, బండమాదారం వార్డుల్లో బీజేపీ నాయకులు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవల గురించి వివరించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహార పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సేవలందిస్తున్న టీచర్లు, ఆశా వర్కర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎల్లంపేట్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ మేకల రజిత దేవేందర్ రెడ్డి, బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యక్షుడు గౌరారం జగన్ గౌడ్, కౌన్సిలర్లు అర్చన శ్రీనివాస్, మహేశ్వరి రాజేష్, శారద రాజు నాయక్, జనరల్ సెక్రటరీ కంచగంట మహేష్, సీనియర్ నాయకులు పోచయ్య ముదిరాజ్, పుష్ప మల్లారెడ్డి, నాగేష్ ముదిరాజ్, రవి నాయక్, లక్ష్మణ్, హరి ప్రసాద్ గౌడ్, నాగార్జున రెడ్డి, చంద్రం, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.




## తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక చాకలి ఐలమ్మ

### తెలంగాణ సాయుధ పోరాటంలో రజాకార్లను ఎదిరించిన వీరవనిత

**మేడ్చల్, నేడు న్యూస్:** తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక తెలంగాణ సాయుధ పోరాటంలో రజాకార్లను తరిమికొట్టేందుకు ధైర్యంగా పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ అని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓబిసి సెల్ అధ్యక్షుడు రవి ముదిరాజ్ అన్నారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓబీసీ విభాగం అధ్యక్షుడు జి. రవి ముదిరాజ్ ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ తెలంగాణ సమాజానికి స్ఫూర్తిప్రదాత అని పేర్కొన్నారు. భూమి, భుక్తి, విముక్తి కోసం సాగిన పోరాటంలో ఆమె చూపిన తెగువ, ధైర్యసాహసాలు చిరస్మరణీయమని అన్నారు. నాటి అన్యాయాలు, దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి మహిళా శక్తికి ప్రతీకగా నిలిచారని కొనియాడారు. తెలంగాణ ఆత్మగౌరవం కోసం ఐలమ్మ చేసిన పోరాటం నేటి తరానికి ఆదర్శమని, ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆమెకు అర్పించే నిజమైన నివాళి అని జి. రవి ముదిరాజ్ పేర్కొన్నారు.




## డే కేర్ సెంటర్లు అందుబాటులో ఉండాలి

### అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**మేడ్చల్, నేడు బ్యూరో:** డే కేర్ సెంటర్లు పూర్తి స్థాయిలో సీనియర్ సిటిజన్స్ కు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. అందుకు తగిన స్టాండర్స్ పాటించాలని సూచించారు. మేడ్చల్ జిల్లా మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, అంతర్జాతీయ వయెవృద్ధుల దినోత్సవ వేడుకలలో బాగంగా, జిల్లాలో కెపాసిటీ బిల్డింగ్ ఇన్ ఓల్డ్ ఏజ్ హోం అనే ప్రోగ్రాం కింద శనివారం మేడ్చల్ జిల్లాలోని శామీర్ పేట ఎం.పి.డి.ఓ ఆఫీసు ప్రాంగణంలోని సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్ లో వేడుకను నిర్వహించారు. ఇందులో జిల్లా అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ ఆహ్మద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సీనియర్ సిటిజన్స్ కీ కెపాసిటీ బిల్డింగ్ ఇన్ ఓల్డ్ ఏజ్ హోం అనే ప్రోగ్రాం పైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రములో జిల్లా సంక్షేమ ఆధికారి శారద, సూపర్ వైజేర్స్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ మెంబెర్స్, వృద్ధుల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



## ఎల్లంపేటలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

- గ్రామ ముఖద్వారం వద్ద అనుమతులు లేకుండా మూడు వాణిజ్య షెట్టర్ల నిర్మాణం
- నిర్మాణం పూర్తవుతున్నా స్పందించని అధికారులు.. చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల డిమాండ్

**మేడ్చల్, నేడు న్యూస్:** ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పట్టణంలోని గ్రామ ముఖద్వారం వద్ద వివేకానంద విగ్రహం పక్కనే ఎలాంటి అనుమతులు లేకుండా మూడు వాణిజ్య షెట్టర్ల నిర్మాణం చేపడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. నిర్మాణ పనులు ప్రారంభమైనప్పటి నుంచి దాదాపు పూర్తయ్యే దశకు చేరుకున్నప్పటికీ మున్సిపల్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణదారులకు నోటీసులు జారీ చేయకపోవడం, ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. సాధారణ ప్రజలు చిన్నపాటి నిర్మాణాలు చేపట్టాలన్నా అనుమతుల పేరుతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని, అయితే ప్రధాన కూడలిలో వాణిజ్య నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నిస్తున్నారు.

### వెంటనే స్పందించాలి.. చర్యలు తీసుకోవాలి

సంబంధిత మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా లేదా అన్న విషయాన్ని పరిశీలించాలని గ్రామస్తులు కోరుతున్నారు. అనుమతులు లేకుండా నిర్మాణం చేపట్టినట్లు తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



## మిలటరీ ఇంజనీరింగ్ సర్వీస్ దినోత్సవం

**సికింద్రాబాద్, నేడు న్యూస్:** మిలటరీ ఇంజనీరింగ్ సర్వీస్ (ఎం ఈ ఎస్) 104వ దినోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ కార్యక్రమాలు సందడి చేశాయి. చిన్నారుల ఆటపాటలు, నృత్య ప్రదర్శనలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి చూపరులను ఆకట్టుకున్నాయి. ప్రతి సంవత్సరం నిర్వహించే ఎం ఈ ఎస్ డే సందర్భంగా ఆర్మీ అధికారులు, సివిల్ అధికారులు, స్థానిక ఉద్యోగుల మధ్య వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. క్రికెట్, వాలీబాల్, క్యారం బోర్డ్, టేబుల్ టెన్నిస్ తదితర క్రీడల్లో ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు కమాండర్ వర్క్స్ ఇంజనీర్స్ అధికారులు ట్రోఫీలు, బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు, ఉద్యోగులు పరస్పరం ఎం ఈ ఎస్ డే శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కార్యక్రమంలో జి ఈ సౌత్, జి ఈ నార్త్, జి ఈ గోల్కొండ, సి డబ్ల్యూ ఈ-1, డబ్ల్యూ ఈ-2 అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు ప్రపంచ టూరిజం దినోత్సవం

### కలెక్టరేట్‌లో సెలబ్రేషన్స్



**మేడ్చల్, నేడు బ్యూరో:** ప్రపంచ టూరిజం దినోత్సవాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 27న ఆదివారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ లో ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ లు ముఖ్య అతిథులుగా పాల్గొన నున్నారు. అలాగే, టూరిజం జిల్లా నోడల్ ఆఫీసర్ సాంబశివ రావు, డీ.ఐ.ఈ.ఓ కిషన్, డీ.ఈ.వో రేణుకా దేవి లు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. జిల్లాలో ఇప్పటికే స్కూల్స్, కాలేజీలలో వివిధ అంశాలలో నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఈ ఉత్సవంలో బహుమతులు ప్రధానం చేయనున్నారు. అనంతరం, విద్యార్థులను టూరిజం కేంద్రాలకు తీసుకెళ్లనున్నారు. ఈ ఉత్సవాన్ని జయప్రదం చేయాలని జిల్లా క్రీడలు, యువజన సంక్షేమం, టూరిజం శాఖ అధికారి వై.దామోదర్ రెడ్డి కోరారు.




## పీఆర్సీని దసరాలోపు ప్రకటించాలి

### డీఏల ఉత్తర్వులు వెంటనే ఇవ్వాలి: జి. దేవీ ప్రసాద్

**హైదరాబాద్, నేడు న్యూస్:** ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ జి. దేవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 30తో పీఆర్సీ గడువు ముగియనున్నందున దసరాలోపు కొత్త పీఆర్సీని ప్రకటించాలని కోరారు. పీఆర్సీ నివేదికను వెంటనే తెప్పించుకుని నిర్ణయం తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వం రెండు డీఏలు మాత్రమే ఇస్తామని ప్రకటించిందని, మిగిలిన డీఏలు ఎప్పుడు ఇస్తారనే దానిపై స్పష్టత లేదన్నారు. డీఏలకు సంబంధించిన ఉత్తర్వులను తక్షణమే జారీ చేయాలని కోరారు. పీఆర్సీ గడువును ప్రభుత్వం పొడిగిస్తే ఉద్యోగులు ఆందోళనకు దిగాల్సిన పరిస్థితి వస్తుందని పేర్కొన్నారు. సీపీఎస్‌ను రద్దు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పుడు అధ్యయన కమిటీ ఏర్పాటు చేస్తామని చెప్పడం సరికాదన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుండా మేనిఫెస్టో పేరుతో ప్రజలను మోసం చేయొద్దని అన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు.

### ఆరోగ్య కార్డులతో ఇబ్బందులు

ఉద్యోగుల ఆరోగ్య కార్డులను పలు ఆసుపత్రులు పరిగణనలోకి తీసుకోవడం లేదని దేవీ ప్రసాద్ తెలిపారు. వెల్‌నెస్ సెంటర్లకు ఓపీ సేవలు అప్పగించినా అవసరమైన సిబ్బంది, మందులు, రోగ నిర్ధారణ పరీక్షల కోసం ప్రయోగశాలలు ఏర్పాటు చేయలేదన్నారు. ఓపీ సేవలను కేవలం నిమ్స్‌కే పరిమితం చేయడం వల్ల ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. డీఏలు, టీఏలు, సరెండర్ లీవ్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రాన్ ఖాతాల్లోని సుమారు రూ.10 వేల కోట్లపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. ఉద్యోగులు కొత్తగా ఏమీ కోరడం లేదని, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని మాత్రమే అడుగుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్టీఎఫ్ మాజీ అధ్యక్షుడు భుజంగరావు, టీజీపీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్ పాల్గొన్నారు.




## చాకలి ఐలమ్మ 131వ జయంతి

### గ్రంథాలయం వద్ద ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసిన నాయకులు

### మేడ్చల్ రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

**మేడ్చల్, నేడు న్యూస్:** వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా మేడ్చల్‌లోని గ్రంథాలయం వద్ద ఉన్న ఆమె విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, రజక సంఘం ప్రతినిధులు ఐలమ్మ చేసిన పోరాటాలను, సమాజానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మణికంఠ గౌడ్, మాజీ గ్రంథాలయ చైర్మన్ భాస్కర్ యాదవ్, మేడ్చల్ రజక సంఘం అధ్యక్షుడు పంచగారి శ్రీనివాస్ పాల్గొని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిన వీరనారి అని పేర్కొన్నారు. భూమి, భుక్తి, విముక్తి కోసం సాగిన పోరాటంలో ఆమె చూపిన ధైర్యసాహసాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఆమె చేసిన పోరాటాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విష్ణు చారి, సంజీవరావు, యాదగిరి, రాందాస్, సూర్యం, మల్లేష్, మోనార్క్, శైలేందర్, నర్సింగ్, ప్రవీణ్, భాస్కర్, రాజశేఖర్ పాల్గొని చాకలి ఐలమ్మకు ఘనంగా నివాళులర్పించారు.

# ప్రాణం కంటే ఏ పరీక్షా పెద్దది కాదు!

- ఐఐటీ బాంబే ఘటనలు చెబుతున్న గుణపాఠం
- మార్కులు, ర్యాంకుల ఒత్తిడిలో విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని విస్మరించొద్దు

**ఐఐటీలో సీటు సాధించడం ఎంతోమంది విద్యార్థుల కల. అందుకోసం ఏళ్ల తరబడి కష్టపడతారు. రాత్రింబవళ్లు చదువుతారు. తల్లిదండ్రులూ ఎన్నో త్యాగాలు చేస్తారు. సీటు వచ్చిన రోజు ఇంట్లో పండగ వాతావరణం. కానీ.. అక్కడితో పోరాటం ఆగడం లేదు. చదువు, మార్కులు, ర్యాంకులు, ఉద్యోగం, వేతనం.. ఇలా ప్రతి దశలో ఒత్తిడి పెరుగుతూనే ఉంది.**

**హైదరాబాద్, నేడు ప్రతినిధి:** ఇటీవల ఐఐటీ బాంబేలో చోటుచేసుకున్న వరుస విషాద ఘటనలు విద్యార్థుల మానసిక ఒత్తిడిపై ఆందోళన కలిగిస్తున్నాయి. గత ఏడు నెలల్లో ముగ్గురు విద్యార్థులు క్యాంపస్‌లోనే బలవన్మరణానికి పాల్పడ్డారన్న వార్తలు కలవరపెడుతున్నాయి. రెండో సంవత్సరం విద్యార్థి సాహిల్ వాకోడే మృతి కూడా విషాదాన్ని మిగిల్చింది. పరీక్షలో సెల్‌ఫోన్ వినియోగానికి సంబంధించిన వివాదం, అనంతరం కుటుంబ సభ్యులు చేసిన వివక్ష ఆరోపణలపై చర్చ జరుగుతోంది. దర్యాప్తు కొనసాగుతున్నందున పూర్తి వాస్తవాలు వెలుగులోకి రాకముందే ఒక నిర్ణయానికి రావడం సరికాదు. అయితే ఈ ఘటన ఒక ప్రశ్నను మాత్రం ముందుకు తెస్తోంది. మార్కులు, ర్యాంకుల కంటే విద్యార్థి ప్రాణం విలువైనదే కదా? ఇది ఒక్క ఐఐటీ సమస్య కాదు.. విద్యార్థుల బలవన్మరణాలు ఒక్కో విద్యాసంస్థకు పరిమితమైన సమస్య కాదు. దేశవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్న పరిణామం. జాతీయ నేర గణాంక సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) నివేదిక ప్రకారం 2024లో దేశవ్యాప్తంగా 14,488 మంది విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడ్డారు. 2023లో ఈ సంఖ్య 13,892. 2014లో 8,068గా ఉన్న ఈ సంఖ్య పదేళ్లలో గణనీయంగా పెరిగింది. మొత్తం ఆత్మహత్యల్లో విద్యార్థుల వాటా కూడా 2014లో 6.1 శాతం నుంచి 2024లో 8.5 శాతానికి చేరింది. ఈ సంఖ్యలను కేవలం గణాంకాలుగా చూడకూడదు. ప్రతి సంఖ్య వెనుక ఒక కుటుంబం ఉంది. తల్లిదండ్రుల ఆశలు, కన్నీళ్లు ఉన్నాయి. అయితే.. బలవన్మరణాలకు



ఒక్క కారణమే అని ఈ గణాంకాలు చెప్పవు. చదువు ఒత్తిడి, కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యం, సంబంధాలు.. ఇలా అనేక అంశాలు ప్రభావం చూపవచ్చు. ప్రతి ఘటనను ఒకే కారణానికి ముడిపెట్టడం సరికాదు.

### ఒక్క పరీక్ష.. జీవితానికి తీర్పు కాదు

విద్యార్థి తప్పు చేస్తే క్రమశిక్షణ అవసరమే. పరీక్షల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకోవాల్సిందే. కానీ.. దిద్దుకునే అవకాశం కూడా ఉండాలి. ఒక పరీక్షలో విఫలమైతే మరోసారి రాయొచ్చు. ఒక సబ్జెక్టులో తప్పితే మళ్లీ చదవొచ్చు. ర్యాంకు తగ్గితే మరోసారి ప్రయత్నించొచ్చు. ఉద్యోగం రాకపోతే మరో మార్గం వెతుక్కోవచ్చు. కానీ.. ప్రాణం పోతే మాత్రం మరో అవకాశం ఉండదు. అందుకే విద్యాసంస్థల్లో క్రమశిక్షణతో పాటు మానవీయత కూడా అవసరం. తప్పును గుర్తించాలి.. కానీ ఆ తప్పే విద్యార్థి జీవితానికి ముగింపు కాకూడదు. సమస్య పరిష్కారంలో విద్యార్థి గౌరవం, భద్రత, మానసిక స్థితిని కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

### 'మార్కులు ఎంత?' కాదు.. 'ఎలా ఉన్నావు?'

విద్యార్థిని చూసినప్పుడు 'ఎన్ని మార్కులు వచ్చాయి?', 'ర్యాంకు ఎంత?', 'ఏ ఉద్యోగం వస్తుంది?' అని అడుగుతాం. ఇవన్నీ ముఖ్యమే. కానీ.. 'నువ్వు ఎలా ఉన్నావు?' అన్న ప్రశ్న కూడా అంతే ముఖ్యం. చదువుపై ఆసక్తి తగ్గిందా? ఒంటరిగా ఉంటున్నాడా? స్నేహితులకు దూరమవుతున్నాడా? తరచూ భయపడుతున్నాడా? మౌనంగా ఉంటున్నాడా? ఇలాంటి మార్పులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గమనించాలి. 'నువ్వు సాధించాలి' అనే మాటతో పాటు.. 'నువ్వు విఫలమైనా మేమున్నాం' అనే భరోసా కూడా ఇవ్వాలి.

### క్యాంపస్‌లో భరోసా పెరగాలి

విద్యార్థి తన సమస్యను చెప్పడానికి భయపడకూడదు. విద్యాసంస్థల్లో మానసిక సలహా, సహాయ సేవలు అందుబాటులో ఉండాలి. కౌన్సెలింగ్‌ను బలహీనతగా చూసే పరిస్థితి మారాలి. విద్యార్థుల ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకూడదు. క్రమశిక్షణ చర్యల్లోనూ మానవీయ కోణాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. చదువులో ఇబ్బంది ఎదురైతే ఒంటరిగా భరించాల్సిన అవసరం లేదు. తల్లిదండ్రులతో, ఉపాధ్యాయులతో, స్నేహితులతో మాట్లాడాలి. అవసరమైతే నిపుణుల సహాయం తీసుకోవాలి. సమస్యను చెప్పడం ఓటమి కాదు. సహాయం కోరడం బలహీనత కాదు. మళ్లీ ప్రయత్నించడం తప్పు కాదు. ఒక పరీక్ష ఫలితం మనిషి మొత్తం జీవితాన్ని నిర్ణయించదు. మార్కులు ఒక సంఖ్య మాత్రమే. ర్యాంకు ఒక గుర్తింపు మాత్రమే. ఉద్యోగం జీవితంలోని ఒక దశ మాత్రమే. విద్యార్థి మార్కుల కంటే విలువైనవాడు. ర్యాంకుల కంటే అతని జీవితం పెద్దది. పరీక్ష ఒక దశ మాత్రమే.. జీవితం అంతకంటే పెద్దది.



చదువు జీవితాన్ని నిర్మించాలి.. జీవితాన్ని ముగించకూడదు.

– జి.అజయ్ కుమార్

## విద్యార్థుల్లో వెల్లివిరిసిన 'మాతృ'భిమానం

- ఘనంగా 'సౌదామని' సాహిత్య సంస్థ ఆవిర్భావ వేడుకలు
- ఆలోచింపజేసిన వ్యాసరచన పోటీలు.. ప్రతిభావంతులకు సత్కారం
- అక్షరం ఆలోచనకు ఆయువు.. తెలుగు మన సంస్కృతికి చిరునామా
- భాషాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తల పిలుపు



**దేవరుప్పుల నేడు న్యూస్:** మాతృభాషపై మమకారాన్ని పెంపొందిస్తూ, విద్యార్థుల్లోని సృజనాత్మక రచనా నైపుణ్యాలను వెలికితీయడమే లక్ష్యంగా దేవరుప్పుల మండల కేంద్రంలో నిర్వహించిన భాషాభివృద్ధి కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం 'సౌదామని సాహిత్య సంస్థ' ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు చింత ప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేకంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలు వారిలోని భాషాభిమానానికి దర్పణం పట్టాయి. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులకు "ఆధునిక కాలంలో తెలుగు భాషాభివృద్ధికి తీసుకోవలసిన చర్యలు" అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో దేవరుప్పుల మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆధునిక సమాజంలో మాతృభాష ఆవశ్యకత, తెలుగు భాషా వైభవం, సాహిత్య పరిమళాలను తమ లేఖిని ద్వారా అక్షర బద్ధం చేసి విద్యార్థులు అందరి మన్ననలు పొందారు. వ్యాసరచన పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా శాలువాలు కప్పి, మెమొంటోలు, ప్రశంసా పత్రాలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ పోటీల్లో దేవరుప్పుల శ్రీ సాయి ప్రశాంతి విద్యానికేతన్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థిని ముత్యం సాత్విక ప్రథమ బహుమతి సాధించగా, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న భౌరోజు సాత్విక ద్వితీయ బహుమతిని, శ్రీ సాయి ప్రశాంతి విద్యానికేతన్‌కే చెందిన 10వ తరగతి విద్యార్థి చింతకింది హనీష్ తృతీయ బహుమతిని కైవసం చేసుకున్నారు. అలాగే, పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికీ ప్రశంసా పత్రాలను పంపిణీ చేసి వారిలో స్ఫూర్తిని నింపారు. తరతరాల సంస్కృతికి ప్రతీక మన తెలుగు: వక్తలు ఈ సందర్భంగా పలువురు కవులు, కళాకారులు, రచయితలు మాట్లాడుతూ.. "అక్షరం ఆలోచనకు ఆయువు, భాష భావానికి బలం.. తెలుగు మన సంస్కృతికి నిలువెత్తు చిరునామా" అని అభివర్ణించారు. తెలుగు కేవలం సంభాషణకు మాత్రమే పరిమితమైనది కాదని, తరతరాల సంప్రదాయాలకు, సాహిత్య వైభవానికి అది ప్రతీక అని ఉద్ఘాటించారు. విద్యార్థులు మాతృభాషను ప్రేమించడంతో పాటు, సృజనాత్మకంగా వ్యక్తీకరించడం ద్వారా భావితరాలకు సజీవంగా అందించాలని పిలుపునిచ్చారు. అనంతరం సౌదామని సాహిత్య సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు చింత ప్రసాద్ మాట్లాడుతూ.. గ్రామీణ స్థాయి నుంచే విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు, తెలుగు సాహిత్య రంగంపై వారికి ఆసక్తిని పెంపొందించేందుకు తమ సంస్థ నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అతిథులకు, ఉపాధ్యాయులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ భాస్కర్ హాజరయ్యారు. వారితో పాటు సౌదామని సాహిత్య సంస్థ ఉపాధ్యక్షులు అంకాల సోమయ్య, జనగామ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు నక్క సురేష్, పోతన సాహిత్య కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షులు మాన్యపు విజేందర్, పెంబర్తి (జనగామ) అభినందన కల్చరల్ సొసైటీ బాధ్యులు అయిలా సోమనరసింహచారి, చిన్నమడూర్ బీసీ హాస్టల్ వార్డెన్ బోనగిరి పూర్ణచందర్, కళాశాల అధ్యాపకులు అనంతచారి, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సంస్థ ప్రధాన కార్యదర్శి జోగు సుదర్శన్, జోగు మధు, పలువురు కవులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయంలో ఐలమ్మకు ఘన నివాళి



**దేవరుప్పుల నేడు న్యూస్:** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను దేవరుప్పుల మండల తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. జనగామలో రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారిక పర్యటన ఉండటంతో, మండల తహసీల్దార్ ఆ విధుల్లో పాల్గొన్నారు. దీంతో ఆయన ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) రాజు ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. రెవెన్యూ కార్యాలయ సిబ్బందితో కలిసి ఆర్ఐ రాజు ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా అంజలి ఘటించారు. తెలంగాణ సమాజానికి ఆమె చేసిన సేవలను, దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా సాగించిన పోరాట స్ఫూర్తిని ఈ సందర్భంగా వారు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది జూనియర్ అసిస్టెంట్లు నరేందర్, శారద, రికార్డ్ అసిస్టెంట్లు మంజుల, రాజు, అటెండర్లు చంద్రయ్య, రేణుక తదితరులు పాల్గొన్నారు.



## నివృత్తి డీ-అడిక్షన్ కేంద్రాలకు ఎస్కోచ్ అవార్డు

### తెలంగాణ జైళ్ల శాఖ వినూత్న కార్యక్రమానికి జాతీయ గుర్తింపు

**చర్లపల్లి, నేడు న్యూస్:** తెలంగాణ జైళ్లు, కరెక్షనల్ సర్వీసెస్ శాఖ చేపట్టిన 'నివృత్తి' డీ-అడిక్షన్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిష్ఠాత్మక ఎస్కోచ్ అవార్డు --2026 లభించింది. న్యూఢిల్లీలోని ఇండియా హ్యాబిటాట్ సెంటర్‌లో నిర్వహించిన 109వ ఎస్కోచ్ సమ్మిట్--ఇండియా ఎకనామిక్ ఫోరంలో ఈ పురస్కారాన్ని అందజేశారు. ఖైదీల్లో మాదకద్రవ్యాల వినియోగ సమస్యను పరిష్కరించేందుకు చేపట్టిన పునరావాస ఆధారిత విధానాన్ని గుర్తిస్తూ ఈ అవార్డును ప్రదానం చేశారు. తెలంగాణ జైళ్లు, కరెక్షనల్ సర్వీసెస్ డీజీ డా. సౌమ్య మిశ్రా ఐపీఎస్ ఈ అవార్డును స్వీకరించారు. కార్యక్రమంలో ఎస్కోచ్ లా ఆఫీసెస్ వ్యవస్థాపకుడు రోహన్ కొచర్, ఎస్కోచ్ గ్రూప్ చైర్మన్ సమీర్ కొచర్, జైళ్ల శాఖ డీఐజీ ఎం. సంపత్ పాల్గొన్నారు.

### 4,200 మందికి స్క్రీనింగ్

'డ్రగ్-ఫ్రీ తెలంగాణ' లక్ష్యానికి అనుగుణంగా నివృత్తి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. భారత ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మాదకద్రవ్య డిమాండ్ తగ్గింపు జాతీయ కార్యాచరణ ప్రణాళిక సహకారం అందిస్తోంది. ఇందులో భాగంగా 4,200 మంది ఖైదీలను మాదకద్రవ్య వినియోగ సమస్యల కోసం స్క్రీనింగ్ చేయగా.. 2,126 మందికి డబ్ల్యూహెచ్ఓ--అసిస్ట్ స్క్రీనింగ్ నిర్వహించి కౌన్సెలింగ్, చికిత్స అందించారు. విడుదలైన 300 మంది ఖైదీలకు అనంతరం కూడా అవసరమైన సహాయాన్ని అందించారు.

### ఐదు జైళ్లలో కేంద్రాలు

నివృత్తి డీ-అడిక్షన్ కేంద్రాలను హైదరాబాద్ చంచల్‌గూడ కేంద్ర కారాగారం, చర్లపల్లి, సంగారెడ్డి, నిజామాబాద్ కేంద్ర కారాగారాలతో పాటు హైదరాబాద్‌లోని మహిళా ప్రత్యేక కారాగారంలో ఏర్పాటు చేశారు. మాదకద్రవ్య వినియోగ సమస్యలను గుర్తించడం, స్క్రీనింగ్, కౌన్సెలింగ్, చికిత్స, పునరావాసం, విడుదల అనంతరం సమాజంలో పునరేకీకరణకు సహకారం అందించడం వంటి సేవలను కేంద్రాలు అందిస్తున్నాయి.

### అంతర్జాతీయ వేదికపైనా గుర్తింపు

నివృత్తి కార్యక్రమం ప్రభావాన్ని ఏపీసీఏ, వెల్లూరు నిర్వహించిన అధ్యయనం ద్వారా అంచనా వేశారు. అధ్యయన ఫలితాలను న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్‌లో జరిగిన అంతర్జాతీయ కరెక్షన్స్ పరిశోధన సదస్సు--2026లో ప్రదర్శించారు. దీంతో తెలంగాణ జైళ్ల శాఖ పునరావాస విధానానికి అంతర్జాతీయ స్థాయిలోనూ గుర్తింపు లభించింది. అవార్డు రావడం జైళ్ల శాఖ అధికారులు, సిబ్బంది చేస్తున్న కృషికి గుర్తింపుగా డీజీ డా. సౌమ్య మిశ్రా పేర్కొన్నారు. ఖైదీలు వ్యసనాన్ని అధిగమించి ఆత్మవిశ్వాసాన్ని తిరిగి పొందేందుకు నివృత్తి కార్యక్రమం దోహదపడుతోందన్నారు. జైలు నుంచి విడుదలైన తర్వాత కూడా ఆఫ్టర్‌కేర్, సామాజిక పునరేకీకరణ కొనసాగాల్సిన అవసరం ఉందని తెలిపారు. 'కస్టడీ విత్ కేర్', 'ట్రాన్స్‌ఫార్మింగ్ లైవ్స్' అనే శాఖ దృక్పథానికి అనుగుణంగా మానవీయ, శాస్త్రీయ ఆధారిత పునరావాస విధానాలను బలోపేతం చేయడంలో ఈ పురస్కారం గుర్తింపుగా నిలిచిందని శాఖ తెలిపింది.

## తెలంగాణ పవర్ పాలిటిక్స్‌లో
# కొత్త హీట్

**బొగ్గు, విద్యుత్‌పై జగదీశ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు**

- ట్రాన్స్‌కోపై 'ప్రైవేట్' మంటలు.. రేవంత్ సర్కార్‌పై జగదీశ్ రెడ్డి ఫైర్
- 40 లక్షల టన్నుల బొగ్గుపై మాజీ మంత్రి ప్రశ్నలు
- సింగరేణి బొగ్గు ఎక్కడికి పోతోంది? ఏపీ, కర్ణాటకపై జగదీశ్ రెడ్డి కీలక వ్యాఖ్యలు
- ట్రాన్స్‌కో ప్రైవేటీకరణపై తీవ్ర అభ్యంతరం
- విద్యుత్ ఉత్పత్తి పెంచాలని ప్రభుత్వానికి డిమాండ్



**హైదరాబాద్, సెప్టెంబర్ 26:** సింగరేణి బొగ్గు ఉత్పత్తి, విద్యుత్ సరఫరా, ట్రాన్స్‌కో వ్యవహారాలపై బీఆర్ఎస్ మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకున్నారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యుత్ విధానాలపై ఆయన పలు ఆరోపణలు చేశారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తికి సంబంధించి ప్రభుత్వం తప్పుడు గణాంకాలు వెల్లడిస్తోందని జగదీశ్ రెడ్డి ఆరోపించారు. 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చకు దారితీశాయి. తెలంగాణలో ఉత్పత్తి అవుతున్న నాణ్యమైన బొగ్గును ఏపీ, కర్ణాటకకు తరలిస్తున్నారని ఆయన ఆరోపించారు. యాదాద్రి పవర్ ప్లాంట్‌పై కాంగ్రెస్ నేతలు చేస్తున్న విమర్శలను కూడా ఆయన ఖండించారు. సిమెంట్ పరిశ్రమలకు అవసరమైన బూడిద వినియోగాన్ని దృష్టిలో పెట్టుకుని దామరచర్లలో ప్లాంట్ ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తిని మరింత పెంచాల్సిన అవసరం ఉందని ప్రభుత్వాన్ని కోరారు. ట్రాన్స్‌కో విషయంలోనూ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను జగదీశ్ రెడ్డి తప్పుబట్టారు. సంస్థను ప్రైవేటీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, దీనివల్ల ప్రజలపై విద్యుత్ భారం పెరిగే అవకాశం ఉందని అన్నారు. ఉద్యోగుల్లో ఆందోళన నెలకొందని, ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించే అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని కూడా ఆరోపించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం విద్యుత్ రంగంలో చేసిన పనులను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత విద్యుత్ సరఫరా వ్యవస్థను బలోపేతం చేసి 24 గంటల ఉచిత విద్యుత్ అందించామని చెప్పారు. హైదరాబాద్‌లో విద్యుత్ సరఫరాకు ప్రత్యామ్నాయ మార్గాలతో కూడిన గ్రిడ్ వ్యవస్థ కోసం ట్రాన్స్‌కోపై రూ.36 వేల కోట్లు ఖర్చు చేశామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ విద్యుత్ విధానాలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు.

## కూల్ డ్రింక్‌లో మత్తుమందు కలిపి
# లైంగిక దాడి

**హైదరాబాద్, సెప్టెంబర్ 26:** స్నేహంగా ఉన్నట్లు నటించి కూల్ డ్రింక్‌లో మత్తు మందు కలిపి లైంగిక దాడికి పాల్పడి వీడియోలు చిత్రీకరించాడు. ఆపై లాభాలు వస్తాయంటూ రూ.43 లక్షల పెట్టుబడి పెట్టించి తిరిగి డబ్బులు అడిగితే బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతున్న నిందితుడిని రాయదుర్గం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ భూపతి తెలిపిన మేరకు.. పటాన్‌చెరుకు చెందిన షేక్ నబీ(36) నాలెడ్జ్ సిటీలోని ఓ ఐటీ కంపెనీలో ఫుడ్ వెండర్‌గా పని చేస్తూ సమీపంలో బాక్స్ క్రికెట్ నిర్వహించేవాడు. అదే కంపెనీలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా పని చేసే మహిళ(42) పరిచయమైంది. 2023లో బాక్స్ క్రికెట్ ఆడేందుకు సదరు కంపెనీ ఉద్యోగులు రాత్రి సమయంలో షేక్ నబీ నిర్వహించే బాక్స్ క్రికెట్‌కు వెళ్లారు. కూల్ డ్రింక్‌లో మత్తుమందు కలిపి ఓ గదిలో లైంగిక దాడికి పాల్పడ్డాడు. అదే సమయంలో వీడియోలు, ఫొటోలు తీశాడు. ఆ వీడియోలను అడ్డు పెట్టుకొని లైంగిక దాడి కొనసాగిస్తూ రెస్టారెంట్‌లో పెట్టుబడి పెడితే లాబాలు వస్తాయని నమ్మించి రూ.43 లక్షలు పెట్టించాడు. డబ్బు తిరిగివ్వాలని అడగడంతో వీడియోలు భర్త, పిల్లలకు పంపిస్తానని బ్లాక్‌మెయిల్ చేశాడు. మూడేళ్లుగా లైంగిక దాడి చేస్తున్నాడని, పెట్టుబడి పేరుతో రూ.43 లక్షలు మోసం చేశాడని బాధితురాలు రాయదుర్గం పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. నిందితుడిని శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



# నాలుగు రోజులు అధిక ఉష్ణోగ్రతలు

- రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో పొడి వాతావరణమే
- అక్కడక్కడా జల్లులు, తేలికపాటి వర్షాలు

**హైదరాబాద్:** తీవ్ర వాయుగుండం ప్రభావంతో గత వారం తగ్గుముఖం పట్టిన ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. మేఘావృత పరిస్థితులు తగ్గడం, రాష్ట్రమంతటా పొడి వాతావరణం నెలకొంటుండడంతో ఉష్ణోగ్రతల తీవ్రత పెరుగుతోంది. ఫలితంగా రానున్న నాలుగు రోజుల పాటు రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణం, అంతకంటే కాస్త ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ చెబుతోంది. శనివారం రాష్ట్రవ్యాప్తంగా సాధారణ ఉష్ణోగ్రతలే నమోదయ్యాయి. అంతకు ముందు రోజు(శుక్రవారం)ఉష్ణోగ్రతలతో పోలిస్తే...1.5 డిగ్రీ సెల్సియస్ నుంచి 6 డిగ్రీ సెల్సియస్ మేర ఉష్ణోగ్రతలు పెరిగినట్లు రాష్ట్ర ప్రణాళిక శాఖ గణాంకాలు చెబుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 30 డిగ్రీల నుంచి 34.3 డిగ్రీల మేర గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న నాలుగు రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 36డిగ్రీల నుంచి 38డిగ్రీల మేర నమోదు కావొచ్చని నిపుణులు చెబుతున్నారు. హైదరాబాద్‌లో 33 డిగ్రీ సెల్సియస్ నుంచి 36డిగ్రీ సెల్సియస్ మధ్య గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కావొచ్చు. కాగా, నాలుగు రోజుల్లో నైరుతి రుతుపవనాల సీజన్ ముగుస్తుంది. ప్రస్తుతం నైరుతి రుతుపవనాల ఉపసంహరణ ప్రక్రియ కొనసాగుతోంది. గుర్దాస్‌పూర్, చండీగఢ్, ముజఫర్‌నగర్, అలీగఢ్, ధోల్‌పూర్, ఉదయ్‌పూర్, డీసా, నలియా నుంచి రుతుపవనాల ఉపసంహరణ కొనసాగుతోంది. అక్టోబర్ రెండో వారం కల్లా దేశవ్యాప్తంగా రుతుపవనాల ఉపసంహరణ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉంది. రానున్న నాలుగు రోజులకు తెలంగాణకు ప్రత్యేక భారీ వర్ష హెచ్చరికలు లేవని ఐఎండీ తెలిపింది. అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని ప్రకటించింది. ఆది, సోమ వారాల్లో రాష్ట్రంలో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని, ఆ తర్వాత గరిష్ట ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయని వాతావరణ శాఖ అంచనాలు విడుదల చేసింది.



## గుడిసెలు లేని రాష్ట్రంగా
# తీర్చిదిద్దడమే లక్ష్యం

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**జనగామ :** ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా తెలంగాణను గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. జనగామలో శనివారం ఆయన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశం, మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమాలకు హాజరవడంతోపాటు రూ.45 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రిస్టన్ మైదానంలో జరిగిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల సొంతింటి కలను నిజం చేస్తున్నామన్నారు. తొలి విడతలో 4.50 లక్షల ఇళ్లు మంజూరు చేశామని, దసరా నాటికి 2.18 లక్షల ఇళ్లు పూర్తవుతాయన్నారు. కేంద్రం ఒక్కో ఇంటికి రూ.72 వేలు ఇచ్చేదాకా ఎదురు చూడకుండా 40 వేల ఇళ్లకు తుది బిల్లు ఇచ్చామని, మరో 1.80 లక్షల ఇళ్లకు ఇస్తామని చెప్పారు. రెండో విడతలో నియోజకవర్గానికి 2 వేల చొప్పున 2.50 లక్షల ఇళ్లు కేటాయించామని వివరించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్ల స్థలాలకు సేకరించిన భూమిలో పంపిణీ కాని ప్లాట్లు అందించడంతోపాటు.. వాటిలోనే ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామన్నారు. రాజకీయాలకు అతీతంగా ఏ నియోజకవర్గం అన్న తేడా లేకుండా అర్హులందరికీ ఈ పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. ఎంపీ చామల, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బాలమణి తదితరులు పాల్గొన్నారు.

## రూ.13 చెల్లిస్తే ప్రతి గొర్రె, మేకకు
# బీమా సౌకర్యం

**పశుసంవర్ధకశాఖ మంత్రి వాకిటి శ్రీహరి**

**గొర్రెల పెంపకందారుల సొసైటీల రుణ మాఫీకి కృషి: మంత్రి పొన్నం**



**కరీంనగర్ :** ఒక గొర్రె లేదా మేకకు పెంపకం దారులు ఏడాదికి రూ.13 చెల్లిస్తే మిగతా సొమ్ము ప్రభుత్వం భరించి బీమా సౌకర్యం కల్పిస్తుందని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. శనివారం కరీంనగర్‌లో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా బస్టాండ్ ఆవరణలో అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరించారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా కలెక్టరేట్ రోడ్డులోని ఆమె విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం గొర్రెల పెంపకందారుల సహకార సంఘం మొదటి మహాసభలో పాల్గొని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గొర్రెలు, మేకల బీమాకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి, పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ.. 'గొర్రెల పెంపకందారులకూ బీమా కల్పిస్తాం. ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసేలా గొర్రెలు, మేకలు పెంచాలి" అని పేర్కొన్నారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. "గొర్రెల పెంపకందారుల సొసైటీల రుణ బకాయిలను మాఫీ చేయిస్తాం. వృత్తిదారులకు సంక్షేమం అందించేలా రూ.5లక్షల ఇందిరమ్మ బీమా వర్తింపజేసేందుకు ప్రభుత్వం యోచిస్తోంది. నెల రోజుల్లో ఈ పథకంపై నిర్ణయం వెలువడే అవకాశం ఉంది" అని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సమాఖ్య ఛైర్‌పర్సన్ కె.సరిత తిరుపతయ్య, యాదవ, కురుమ కార్పొరేషన్ ఛైర్మన్ రఘునాథ్ యాదవ్, పశుగణన అభివృద్ధి సంస్థ ఛైర్మన్ చరణ్‌కౌశిక్ యాదవ్, మున్నూరు కాపు కార్పొరేషన్ ఛైర్మన్ బొమ్మ శ్రీరాం చక్రవర్తి, పశుసంవర్ధక శాఖ ఎండీ సుబ్బారాయుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సత్తు మల్లేశం, గొర్రెల పెంపకందారుల సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# జీపీఓ స్థాయి తగ్గిస్తారా?

**కేంద్రానికి ఒవైసీ సీరియస్ రిక్వెస్ట్**

- గ్రూప్ 'ఏ' నుంచి 'బీ'కి.. హైదరాబాద్ జీపీఓపై ఒవైసీ అభ్యంతరం
- పెమ్మసాని, సింధియాలకు ఒవైసీ లేఖ
- సిటీ డివిజన్‌లో విలీనాన్ని వ్యతిరేకించిన ఎంపీ
- స్వతంత్ర గ్రూప్ 'ఏ' సంస్థగా కొనసాగించాలని డిమాండ్



**హైదరాబాద్, సెప్టెంబర్ 26:** నగరంలోని ప్రధాన తపాలా కేంద్రాల్లో ఒకటైన హైదరాబాద్ జనరల్ పోస్టాఫీస్ (జీపీఓ)కు సంబంధించిన పరిపాలనా ప్రతిపాదనపై హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ స్పందించారు. జీపీఓ హోదాను తగ్గించే నిర్ణయం తీసుకోవద్దని కోరుతూ కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాలకు లేఖ రాశారు. జీపీఓను ప్రస్తుతం ఉన్న గ్రూప్ 'ఏ' హోదా నుంచి గ్రూప్ 'బీ'కి మార్చడం, అనంతరం హైదరాబాద్ సిటీ డివిజన్‌లో విలీనం చేయడం వంటి ప్రతిపాదనలు ఉన్నాయని ఒవైసీ తన లేఖలో పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు. హైదరాబాద్ జీపీఓకు భారీ పనిభారం ఉందని, నగరంలోని మెయిల్ కార్యకలాపాల్లో కీలక పాత్ర పోషిస్తోందని ఎంపీ తెలిపారు. జీపీఓ డెలివరీ పరిధి కూడా నిరంతరం విస్తరిస్తోందని పేర్కొన్నారు. ప్రజలకు విస్తృతంగా తపాలా సేవలు అందించే ఈ సంస్థకు పరిపాలనా స్థాయిని తగ్గించడం సముచితం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఫిలాటెలిక్ సేవల పరంగా కూడా జీపీఓ ప్రత్యేకతను కలిగి ఉందని ఒవైసీ తెలిపారు. తెలంగాణలో ఏకైక ఫిలాటెలిక్ బ్యూరో ఇక్కడే ఉందని, తపాలా స్టాంపుల సేకరణతో పాటు పోస్టల్ చరిత్రకు సంబంధించిన కార్యకలాపాలకు ఇది ఉపయోగపడుతోందని వివరించారు. జీపీఓ ఉద్యోగులు తమ సమస్యలను వివరిస్తూ సమర్పించిన వినతిపత్రాన్ని కూడా కేంద్ర మంత్రులకు పంపిన లేఖకు జత చేసినట్లు ఒవైసీ వెల్లడించారు. ప్రజా ప్రయోజనాలు, జీపీఓ చారిత్రక ప్రాధాన్యతను పరిగణనలోకి తీసుకుని ప్రతిపాదనలను రద్దు చేయాలని కోరారు. హైదరాబాద్ జీపీఓను చీఫ్ పోస్ట్‌మాస్టర్ ఆధ్వర్యంలో స్వతంత్ర గ్రూప్ 'ఏ' సంస్థగానే కొనసాగించాలని ఒవైసీ కేంద్రాన్ని కోరారు.



## దసరా నాటికి మెట్రో రైలు
# మొదటిదశ స్వాధీనం

హైదరాబాద్: దసరా నాటికి మెట్రో రైలు మొదటిదశ స్వాధీనం చేసుకునేలా ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం విధించింది. కేంద్ర ప్రభుత్వం సూచించినట్లుగా మెట్రో ఈ బాధ్యతను ఎస్‌బీఐ క్యాప్స్‌కు ఇదివరకే అప్పగించింది. ఈ సంస్థ ముంబయి, గుజరాత్ గిఫ్ట్‌సిటీలోని బ్యాంకులతో సంప్రదింపులు జరిపింది. కానీ బ్యాంకులు చెప్పే వడ్డీయే అసలు సమస్యగా ఉంది. మెట్రోరైలును స్వాధీనం చేసుకోవాలంటే.. బ్యాంకుల నుంచి ఎల్ అండ్ టీ తీసుకున్న రూ.13,600 కోట్ల రుణాలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఈ రుణాలపై సగటున ఏడెనిమిది శాతం దాకా వడ్డీ ఉన్నందున అంతకంటే తక్కువకే రుణాలు పొందగలిగితే భారం తగ్గుతుంది. ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సీ) వడ్డీరేటు 4 శాతం లోపే ఇచ్చేందుకు ముందుకొచ్చినా ఆఖరి నిమిషంలో రుణం ఆగిపోయింది. ఆ సంస్థ కొంత మొత్తం జపాన్ యెన్‌ల రూపంలో, మరికొంత మొత్తం రూపాయల్లో ఇచ్చేందుకు అప్పట్లో అంగీకరించింది. దీనివల్ల రెండూ కలిపి సగటు వడ్డీరేటు 4% లోపే ఉంటుంది. ఇదే తరహాలో తక్కువ వడ్డీకి అప్పులిచ్చే బ్యాంకుల కోసం ఎస్‌బీఐ క్యాప్స్ ప్రయత్నిస్తోంది. తాజాగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రుణం ఇచ్చేందుకు ముందుకొచ్చినా వడ్డీరేటు 7 శాతానికి పైనే చెబుతోంది. రుణ సమీకరణ యత్నాలు ఫలించకపోతే.. ప్రత్యామ్నాయ మార్గాలేమిటని ప్రభుత్వం పరిశీలిస్తోంది. హెచ్ఎండీఏ నుంచి నిధులు సమకూర్చేందుకు సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేస్తోంది. ఐఆర్ఎఫ్‌సీ రుణం కోసం కూడా ప్రయత్నాలు కొనసాగిస్తోంది. గతంలో కుదిరిన ఒప్పందం ప్రకారం రుణాలు విడుదల చేయాలని మెట్రో అధికారులు ఎప్పటికప్పుడు లేఖలు రాస్తూనే ఉన్నారు.

# కాలువలో ముక్కలైన శరీరం..

**ఓ పచ్చబొట్టు చెప్పిన అసలు నిజం!**

- ఇబ్రహీంపట్నం హత్య కేసులో ట్విస్ట్.. పచ్చబొట్టుతో గుర్తింపు
- కాలువలో లభించిన శరీర భాగాలతో పోలీసుల దర్యాప్తు
- కల్యాణి అలియాస్ దుర్గగా మృతురాలి గుర్తింపు
- షఫీని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- కుమారుడి విషయంలో వివాదమే కారణమని ప్రాథమిక నిర్ధారణ





**విజయవాడ, సెప్టెంబర్ 26:** ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో మహిళ హత్య కేసును పోలీసులు ఛేదించారు. సెప్టెంబర్ 17న చన్నీలు కాలువలో లభించిన శరీర భాగాలు కల్యాణి (29) అలియాస్ దుర్గకు చెందినవిగా గుర్తించారు. ఆమెతో సన్నిహిత సంబంధం ఉన్న భవానిపురం వాసి షఫీ ఈ హత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. కాలువలో శరీర భాగాలు బయటపడిన అనంతరం మృతురాలి గుర్తింపు కోసం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆమె ధరించిన దుస్తులు, చేతిపై ఉన్న ప్రత్యేకమైన పచ్చబొట్టు ఆధారంగా ఫొటోలను సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. వాటిని చూసిన కల్యాణి సోదరుడు పోలీసులను సంప్రదించడంతో మృతురాలి వివరాలు బయటపడ్డాయి. పోలీసుల వివరాల ప్రకారం.. కల్యాణి, షఫీ కొంతకాలంగా సహజీవనం చేస్తున్నారు. కల్యాణి తన కుమారుడిని గతంలో షఫీ సంరక్షణలో ఉంచినట్లు తెలుస్తోంది. ఇటీవల కుమారుడిని తిరిగి తన వద్దకు ఇవ్వాలని ఆమె కోరడంతో ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తినట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో సుమారు పది రోజుల క్రితం కల్యాణిని హత్య చేసి, ఆధారాలను మాయం చేసేందుకు మృతదేహాన్ని ముక్కలుగా నరికి ఇబ్రహీంపట్నం సమీపంలోని కాలువలో పడేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. హత్య మంగళగిరిలో జరిగి ఉండవచ్చని కూడా దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. కల్యాణి చిన్నతనంలోనే తల్లిని కోల్పోయి గన్నవరం సమీపంలోని అనాథాశ్రమంలో పెరిగినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం మంగళగిరికి చెందిన వ్యక్తిని వివాహం చేసుకున్నప్పటికీ విభేదాల కారణంగా విడిపోయింది. ఆ తర్వాత మంగళగిరిలోని ఓ హోటల్‌లో పనిచేస్తూ జీవనం సాగించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం షఫీని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు. కేసులో హత్య జరిగిన ప్రదేశం, ఉపయోగించిన విధానం, మృతదేహాన్ని తరలించిన తీరుపై మరింత సమాచారం సేకరిస్తున్నారు. స్థానిక మీడియా సహకారంతో మృతురాలి గుర్తింపు సాధ్యమైందని ఇబ్రహీంపట్నం సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

## స్కూల్ టీచర్‌పట్ల
# ప్రిన్సిపల్ అసభ్య ప్రవర్తన..

**ప్రశ్నించిన వారిపై కత్తితో దాడి**

**హైదరాబాద్:** స్కూల్‌లో పనిచేసే టీచర్ పట్ల ప్రిన్సిపల్ అసభ్యంగా ప్రవర్తించిన ఘటన హైదరాబాద్ సూరారంలోని సాయిబాబా నగర్‌లో చోటుచేసుకుంది. అవమానంతో స్కూల్‌కు వెళ్లడం మానేసిన టీచర్‌ని కుటుంబసభ్యులు ఆరా తీయడంతో జరిగిన విషయం వెలుగులోకి వచ్చింది. సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్న మహిళ పట్ల అదే పాఠశాల ప్రిన్సిపల్ అసభ్యంగా ప్రవర్తిస్తూ, ఆమె పేరును డ్రీమ్‌గర్ల్ అని మొబైల్‌లో సేవ్ చేసుకున్నాడు. మానసికంగా, శారీరకంగా వేధిస్తున్న ప్రిన్సిపల్ వ్యవహారశైలితో ఆమె పాఠశాలకు వెళ్లడం మానేసింది. దీంతో కుటుంబ సభ్యులు ఆరాతీయగా ప్రిన్సిపల్ వేధింపుల విషయం బయటకు వచ్చింది. దీంతో బాధిత టీచర్ సోదరుడు, కాలనీ వాసులు పాఠశాలకు వెళ్లి ప్రిన్సిపల్‌ను నిలదీడయంతో వారిపై కత్తితో విచక్షణారహితంగా దాడి చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు స్కూల్‌లో జరుగుతున్న గొడవను చూసి ఇరువర్గాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కత్తితో దాడిచేసిన కేసులో ప్రిన్సిపల్‌పై, స్కూల్‌పై మూకుమ్మడి దాడి చేశారని కాలనీవాసులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

## చాలా సంవత్సరాల తర్వాత
# సినిమాకు వెళ్తున్నా: కేటీఆర్



నాని కథానాయకుడిగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందిన పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్ 'ది ప్యారడైజ్'. ఇటీవల విడుదలైన ఈ మూవీ మిశ్రమ స్పందనలు అందుకున్నా.. బాక్సాఫీస్ వద్ద మాత్రం వసూళ్లు రాబడుతోంది. ముఖ్యంగా బి, సి సెంటర్లు, సింగిల్ స్క్రీన్ థియేటర్స్‌లో 'ప్యారడైజ్' యాక్షన్ హంగామాకు మాస్ ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. మరోవైపు సోషల్‌మీడియాలోనూ ఈ మూవీ ఏదో విధంగా ట్రెండ్ అవుతూనే ఉంది. ఇప్పుడు ఈ సినిమాను శనివారం రాత్రి వీక్షించనున్నట్లు బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. "చాలా సంవత్సరాల తర్వాత ఈ రోజు రాత్రి థియేటర్‌లో సినిమా చూడాలనుకుంటున్నా. నా అభిమాన నటుడు నాని, ప్రతిభావంతుడైన యువ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కలిసి తీసిన 'ది ప్యారడైజ్' చూడబోతున్నా" అని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను పోలిన ఎమ్మెల్యే శంకర్ పాత్రను ఈ సినిమాలో ప్రియదర్శి పోషించిన సంగతి తెలిసిందే. సవారీ తెగకు, శంకర్ పాత్రకు మధ్య వచ్చే సన్నివేశాలు థియేటర్‌లో అలరిస్తున్నారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ 'ది ప్యారడైజ్' చూస్తానంటూ పోస్ట్ పెట్టడం విశేషం.



కంటెంట్ ఉన్న చిత్రాలు ఎంచుకుంటూ హీరోయిన్‌గా రాణిస్తున్న రెజీనా కసాండ్రా.. ఇప్పుడు మరో ప్రయోగానికి సిద్ధం అయినట్లు తెలుస్తోంది. 'సిల నేరంగలిల్ సిల మనితర్గళ్' అండ్ 'బాంబ్' వంటి చిత్రాలతో దర్శకుడుగా గుర్తింపు తెచ్చుకున్న డైరెక్టర్ విశాల్ వెంకట్ దర్శకత్వంలో రాబోతున్న తదుపరి ప్రాజెక్టులో ఈ హీరోయిన్ ఓకే అయినట్లు తెలుస్తోంది. ఇదొక లేడీ ఓరియెంటెడ్ మూవీ అని తెలుస్తుండగా.. ఇందులో రెజీనా శక్తివంతమైన, బలమైన కేంద్ర పాత్రలో కనిపిస్తుందని తెలుస్తుంది. ఇక క్రేజీ ప్రాజెక్టు యొక్క రెగ్యులర్ షూటింగ్ ఇటీవల ఘనంగా స్టార్ట్ కాగా.. సైలెంట్‌గా చిత్రీకరణ పూర్తి చేస్తున్నారట మేకర్స్. అంతే కాకుండా.. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ అండ్ స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగ

## లేడీ ఓరియెంటెడ్ మూవీలో
# రెజీనా కసాండ్రా

రాజ్‌కు చెందిన 'జి స్క్వాడ్' సంస్థలు ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. ఇక ఈ చిత్రానికి సంబంధిం చిన టైటిల్, ఇతర నటీనటులు, సాంకే తిక నిపుణులకు సంబంధించిన పూర్తి వివరాలు త్వరలోనే అధికారికంగా వెల్లడి కానున్నాయని తెలుస్తుండగా.. ప్రజెంట్ ఇందుకు సంబంధించిన పోస్టులు నెట్టింట సందడి చేస్తున్నాయి.

# దీపికకు రీప్లేస్మెంట్ లేదు..
## క్లారిటీ ఇచ్చిన నాగ్ అశ్విన్



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కెరీర్‌లో బాక్సాఫీస్ హిట్ అందుకున్న చిత్రాల్లో 'కల్కి2898ఏడీ' ఒకటి. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వైజయంతీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అశ్వనీ దత్ నిర్మించిన ఈ పురాణ సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్‌లో అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్‌తో పాటు దీపికా పదుకొణె ప్రదాన పాత్రలో నటించింది. అయితే.. కల్కిలో కథ మొత్తం దీపికా పదుకొణె చుట్టూ తిరుగుతోంది. ఈ సినిమాకు మెయిన్ హైలెట్ ఆమె అని తెలిసిన విషయమే. కానీ, కొన్ని అనివార్య కారణాల చేత కల్కికి సీక్వెల్‌గా వస్తున్న పార్ట్ 2 లో దీపికను తీసేశారని, సాయి పల్లవి లేదా ఆలియా భట్ ఆమె స్థానంలో నటించబోతున్నారనే పుకార్లు వచ్చాయి. ఈ వైరల్ వార్తలపై తాజాగా క్లారిటీ వచ్చింది. 'కల్కి2898ఏడీ' చిత్రంలోని దీపికా పదుకొణె పాత్రను, ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న దీని సీక్వెల్‌లో వేరే నటితో భర్తీ చేయడం లేదు. 'కల్కి 2'లో ఆమె కనిపించనప్పటికీ, కొత్తగా ప్రధాన నటీనటులెవరూ ఇందులో చేరరు. అక్కడితో ఆమె పాత్రను ముగిస్తున్నాము' అని రీసెంట్‌గా దర్శకుడు నాగ్ అశ్విన్ ధృవీకరించారు. దీంతో దీపిక ప్లేస్‌లో వేరే నటి నటిస్తున్నట్లు వస్తున్న వార్తలకు చెక్ పెట్టినట్లు అయింది.



# కొత్తగా తీశామనుకున్నాం..
## స్పందన ఇంత కొత్తగా ఉంటుందనుకోలేదు: నాని



"ఈ సినిమాకు అన్నీ కొత్తగానే జరిగాయి. షూటింగ్ జరిగిన తీరు.. విడుదలకు సమయం దగ్గర పడుతున్న కొద్దీ చోటు చేసుకున్న పరిణామాలు.. ట్రైలర్ లేకపోవడం.. ఒక కొత్త సినిమా కొత్త అనుభూతితో తీస్తున్నామనుకున్నాం కానీ, స్పందన కూడా ఇంత కొత్తగా ఉంటుందనుకోలేదు" అన్నారు నాని. ఆయన కథానాయకుడిగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ది ప్యారడైజ్'. కయాదు లోహర్ కథానాయిక. మోహన్‌బాబు కీలక పాత్ర పోషించారు. ఇటీవల ఈ మూవీ విడుదలైన సందర్భంగా శనివారం చిత్ర బృందం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా నాని మాట్లాడారు. "ఇటీవల విడుదలవుతున్న సినిమాల విషయంలో ఒక పరిణామం జరుగుతోంది. రిలీజ్ అయిన ఉదయం పాజిటివ్ టాక్ ఉంటుంది. సాయంత్రానికి మిక్స్‌డ్ టాక్ వస్తోంది. కానీ, ప్యారడైజ్‌కు రివర్స్ అయింది. ప్రతి షోకు ఆదరణ వస్తోంది. ప్రతి ఒక్కరూ తమ సొంత చిత్రంగా సెలబ్రేట్ చేసుకుంటున్నారు. 'ప్యారడైజ్' హీరో సినిమా కాదు. చిన్న చిన్న పాత్రలు చేసిన వాళ్లు కూడా ఎంతో కష్టపడ్డారు. రోజుల తరబడి నమ్మి ప్రాణం పెట్టి చేశారు. మీరంతా రియల్ హీరోస్. ప్రేక్షకులు థియేటర్‌కు రావడానికి కారణాల్లో అనిరుధ్ సంగీతం కూడా అందులో ఒకటి. మరో పదేళ్లు 'ఆయా షేర్' పాట ఎక్కడో ఒక చోట వినిపిస్తూనే ఉంటుంది"

### ఈ ఏడాది టాక్ ఆఫ్ ఇది ఇండస్ట్రీ 'ప్యారడైజ్'..

"సినిమా అంటే పిచ్చి ఉన్న వాళ్లందరూ కలిసి పనిచేసిన ప్రాజెక్ట్ ఇది. నిర్మాత సుధాకర్ చెరుకూరిలో ఓపిక ఎక్కువ. అనేక కారణాలతో చాలాసార్లు షూటింగ్ ఆగింది. అన్నింటికీ ఆయన మా వెనుక నిలబడ్డారు. ప్రియదర్శి చేసిన శంకరన్న పాత్రకు మంచి స్పందన వస్తోంది. రాఘవ్ జుయల్, కయాదు చక్కగా నటించారు. మోహన్‌బాబుగారితో కలిసి పనిచేసిన తర్వాత నాకెంతో ఇష్టమైన వ్యక్తుల్లో ఆయనా ఒకరైపోయారు. ఆయన ఇంకాస్త ఓపెన్ అయితే బాగుంటుంది. మన బంధం ప్యారడైజ్‌తో సంబంధం లేకుండా కొనసాగాలి. ఈ సినిమాకు హీరో పైనున్న హీరో మోహన్‌బాబుగారు. దర్శకుడు శ్రీకాంత్ ఏ పని చేసినా ప్రాణం పెట్టి చేస్తాడు. శ్రీకాంత్‌కు చాలా స్వేచ్ఛను ఇచ్చానని అందరూ అనుకుంటారు. కానీ, నేను చాలా స్ట్రిక్ట్‌గా ఉంటా. ప్రస్తుతం సినిమాకు తుపానులా స్పందనలు వస్తున్నాయి. ఎక్కడ చూసినా, ఏం ఓపెన్ చేసినా ప్యారడైజ్ ఉంది. సినిమా గురించి చెడుగా వినిపిస్తోందా? మంచిగా వినిపిస్తోందా? అన్నది కాదు.. అంతటా ప్యారడైజ్ వినిపిస్తోంది. ఈ ఏడాది టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీ ఇది" అని నాని అన్నారు. శంకరన్న పాత్ర వెండితెరకు తనకు మరోసారి కొత్తగా పరిచయం చేసిందని నటుడు ప్రియదర్శి చెప్పుకొచ్చారు. శంకరన్న పాత్ర ఒక్క రోజులో వచ్చింది కాదని, దాని వెనుక చాలామంది పనితనం, నైపుణ్యం ఉందన్నారు. 'కొబ్బరిమట్ట' విడుదల తర్వాత మోగిన తన ఫోన్.. మళ్లీ ఇన్నేళ్లకు 'ప్యారడైజ్' విడుదలైన తర్వాత మోగుతూనే ఉందని నటుడు సంపూర్ణేశ్ బాబు అన్నారు. సంపూ నాలుగైదు కామెడీ సినిమాలు చేసి, వెళ్లిపోయాడనుకుంటున్న సమయంలో ప్యారడైజ్ వచ్చిందన్నారు. సాయి రాజేశ్ ఆలోచన నుంచి సంపూర్ణేశ్‌బాబు పుడితే, శ్రీకాంత్ బిర్యానీ పాత్రను పుట్టించాడని సంతోషం వ్యక్తం చేశారు.

# దృష్టి పెట్టకపోతే కష్టమే..


కన్నడ చిత్రం 'ముగిల్‌పేట'తో సినీ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది హీరోయిన్ కాయదు లోహర్. మొదటి చిత్రంతోనే నటన పరంగా మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ అమ్మడు.. తెలుగులోకి 'అల్లూరి' చిత్రంతో అడుగు పెట్టింది. ఆ తర్వాత లోహర్‌కు తెలుగులో అవకాశాలు వస్తున్నప్పటికీ విజయాలు మాత్రం వరించడం లేదు. ఇటీవల వచ్చిన 'ఫంకీ' చిత్రం కూడా బాక్సాఫీస్ వద్ద పరాజయం పాలయింది. దీంతో నాని 'దీ ప్యారడైజ్'పైనే అమ్మడు ఆశలు పెట్టుకున్నది. ఇక భారీ అంచనాలు మధ్య ఈ చిత్రం మిక్సిడ్ టాక్ తెచ్చుకుంటున్నప్పటికీ కలెక్షన్లు మాత్రం భారీగానే రాబడుతోంది. కానీ ఈ చిత్రంలో ఆమెకు అవకాశం దక్కినా ప్రయోజనం లేకపోయినట్లు టాక్. ఇందులో తండ్రి అప్పులు తీర్చేందుకు బి-గ్రేడ్ చిత్రాల్లో నటించే విచిత్రమైన పాత్రలో ఆమె కనిపించడం ప్రేక్షకులకు తీవ్ర అసహనాన్ని కలిగించింది. ఇలాంటి అభ్యంతరకర పాత్రను ఎంచుకోవడం ఆమె కెరీర్‌కు ఏమాత్రం మేలు చేయకపోగా, నెగెటివిటీని మూటగట్టుకుంది. దీంతో ఇప్పటికైనా కథల ఎంపికపై ఆమె దృష్టి పెట్టకపోతే కష్టమేనని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఆడిటింగ్ పనులు ముందుగానే పూర్తి చేసుకోండి

## సీఏలకు ఐసీఏఐ సూచన




ఈనెల 28-30 తేదీల్లో దేశవ్యాప్తంగా ప్రభుత్వ బ్యాంకుల సమ్మె జరుగుతున్న నేపథ్యంలో.. చార్టర్డ్ అకౌంటెంట్లు (సీఏ) తమ ఆడిటింగ్ పనులను ముందే పూర్తి చేసుకోవాలని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) సూచించింది. సెప్టెంబరు 30 నాటికి పూర్తి చేయాల్సిన పనులకు ఆటంకం కలగకుండా, ముందస్తుగా ప్రణాళిక రూపొందించుకోవాలని వివరిస్తూ మార్గదర్శకాలు జారీ చేసింది. ఆడిట్‌లకు అవసరమైన బ్యాంకు సమాచారం, ధ్రువీకరణ పత్రాలను త్వరగా సేకరించుకోవాలని ఐసీఏఐ కోరింది. చివరి నిమిషంలో ఇబ్బందులు ఎదురుకాకుండా, ఖాతాదారుల నుంచి అవసరమైన బ్యాంకింగ్ వివరాలను ముందే తెప్పించుకోవాలని సీఏలకు ఐసీఏఐ స్పష్టం చేసింది. ఆదివారం తమ శాఖలు తెరచి ఉంచుతున్నందున, ఖాతాదార్లు తమ కార్యకలాపాలు నిర్వహించుకోవాలని ప్రభుత్వరంగ బ్యాంకులు కోరాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్‌బ్యాంక్, ఇండస్‌ఇండ్‌బ్యాంక్ 28-30 తేదీల్లో తమ కార్యకలాపాలు యథాతథంగా కొనసాగించనున్నాయి.







## ఏఐ రంగంలో పెట్టుబడులు దేశానికి ముందడుగు : నిర్మలా సీతారామన్

కృత్రిమ మేధ రంగంలో పెట్టుబడులు దేశ భవిష్యత్తుకు ముందడుగు అవుతుం దని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. అన్నీ రంగాల్లో డిజిటల్ వ్యవస్థకు పెద్దపీట వేయాలని పిలుపునిచ్చారు. బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడారు. "కృత్రిమ మేధతో పాటు సెమీకండక్టర్లు, క్వాంటమ్ టెక్నాలజీ రంగాలకు దేశం భారీగా నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది. సాంకేతికతను అందిపుచ్చుకోవడానికి అవసరమైన శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల్లో కూడా ఏఐ వినియోగం పెరగాలి. అన్ని రంగాల్లోనూ సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకుంటే, భారత ఆర్థిక వృద్ధి రేటు 10 శాతాన్ని దాటడం సాధ్యమే. టెక్నాలజీని ఆధారంగా చేసుకుని మరిన్ని రంగాల్లో స్టార్టప్ కంపెనీలు ఆవిర్భవించాలి" అని ఆమె పిలుపునిచ్చారు.

# రోహిత్‌ను ఊరిస్తున్న ప్రపంచ రికార్డు



### విండీస్‌తో తొలి వన్డే..

వెస్టిండీస్‌తో తొలి వన్డే సందర్భంగా టీమిండియా సీనియర్ బ్యాటర్ రోహిత్ శర్మను ప్రపంచ రికార్డు ఊరిస్తోంది. రేపు తిరువనంతపురంలోని గ్రీన్‌ఫీల్డ్ స్టేడియం వేదికగా ఇరుజట్ల మధ్య తొలి వన్డే మ్యాచ్ జరగనుంది. శుక్రవారం జరిగిన టీమిండియా ఇంట్రాస్క్వాడ్ మ్యాచ్‌లో సూపర్ ఫామ్ కనబరిచిన రోహిత్ అదే ఆటను విండీస్‌తో తొలి వన్డేలోనూ ప్రదర్శించాలని పట్టుదలతో ఉన్నాడు. రోహిత్ శర్మ ప్రస్తుతం వన్డే క్రికెట్‌లో భారత్ తరఫున అత్యధిక పరుగులు చేసిన జాబితాలో మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. ఇప్పటివరకు రోహిత్ 288 వన్డే మ్యాచ్‌లాడి 11,895 పరుగులు సాధించాడు. ఇందులో 34 సెంచరీలు, 62 హాఫ్ సెంచరీలున్నాయి. వన్డేల్లో 12వేల పరుగుల మైలురాయిని అందుకునేందుకు రోహిత్‌కు మరో 105 పరుగులు అవసరం. ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్ సందర్భంగా ఆఖరి వన్డేలో సూపర్‌సెంచరీతో మెరిసిన హిట్‌మ్యాన్.. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండే తిరువనంతపురంలోనూ శతకం సాధించాలని భావిస్తున్నాడు. రోహిత్ ఫామ్‌లో ఉంటే ఇదేమీ పెద్ద విషయం కాదు. తొలి వన్డేలో ఈ మైలురాయిని అందుకోలేనప్పటికీ, వన్డే సిరీస్ ముగిసేలోపే 12వేల మార్కును చేరుకోవడం ఖాయం. దీంతో పాటు రోహిత్ శర్మను మరో రికార్డు కూడా ఊరిస్తోంది. అదేంటంటే, మరో 135 పరుగులు చేస్తే వన్డేల్లో ఓపెనర్‌గా 10వేల పరుగుల మార్క్‌ను అందుకుంటాడు. తద్వారా వన్డేల్లో ఓపెనర్‌గా పదివేల పరుగుల మార్క్ అందుకున్న నాలుగో బ్యాటర్‌గా, భారత్ తరఫున రెండో బ్యాటర్‌గా నిలవనున్నాడు. సచిన్ టెండూల్కర్ ఈ ఫీట్ సాధించిన తొలి భారత ప్లేయర్‌గా కొనసాగుతున్నాడు. ఇక వెస్టిండీస్‌పై కూడా వన్డేల్లో రోహిత్ శర్మకు మంచి రికార్డే ఉంది. ఇప్పటివరకు విండీస్‌తో 37 వన్డేలు ఆడిన రోహిత్ 1,613 పరుగులు చేశాడు. ఇందులో మూడు సెంచరీలు, 12 హాఫ్ సెంచరీలున్నాయి.

### అదే అసలైన సవాలు : రోహిత్ శర్మ

మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ మాట్లాడుతూ.. "నేను చేయాల్సిన పని పూర్తయిందనే ఆలోచన ఎప్పుడూ రాదు. ఆడుతున్నంత కాలం.. ఏదో ఒక లక్ష్యం కోసం ఎదురుచూస్తూనే ఉంటాం. ప్రస్తుతం ప్రపంచకప్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. ప్రపంచకప్ లేదా ఏదైనా ఐసీసీ టోర్నమెంట్ ఆడేటప్పుడు వేర్వేరు వేదికలపై.. వేర్వేరు ప్రత్యర్థులను ఎదుర్కొంటాం. కాబట్టి, అందుకు తగినట్లు విభిన్నంగా సిద్ధం కావాలి. కొత్తగా ఆలోచించాలి. అదే అసలైన సవాలు" అని పేర్కొన్నాడు. రాబోయే వన్డే వరల్డ్‌కప్ వరకు ఆడతారా? లేదా? అనే సందేహాలకు ఈ ఇద్దరు తమ వ్యాఖ్యలతో తాజాగా చెక్‌పెట్టినట్లయ్యింది.



## ఏఐతో మోసగించి.. ఇటలీ బ్యాంకుకు రూ.1000కోట్ల కుచ్చుటోపి

కేటుగాళ్లు ఏఐని ఉపయోగించి.. ఓ బ్యాంకుకు రూ.వేల కోట్లు కుచ్చుటోపి వేశారు. సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా నమ్మించి రూ.1034 కోట్లు కొల్లగొట్టిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ భారీ మోసం ఇటలీలోని అతిపెద్ద ప్రైవేట్ బ్యాంకు ఇంటెసా శాన్‌పాలోలో చోటుచేసుకున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఇంతకీ ఏం జరిగిందంటే..? ఇటలీలో అతిపెద్ద బ్యాంకు ఇంటెసా శాన్‌పాలో సంబంధిత విభాగమైన ఫిడ్యూరమ్ మాజీ ఛైర్మన్ పావొలో మోలెసినిని ఫిబ్రవరిలో కేటుగాళ్లు బురిడీ కొట్టించారు. ఇంటెసా శాన్‌పాలో సీఈఓ కార్లో మెస్సినాలా నమ్మబలికి ఏఐ వాయిస్ క్లోనింగ్ సృష్టించి ఫోన్ కాల్ చేశారు. దీంతో మాజీ ఛైర్మన్ పావొలో ఇదంతా నిజమనుకొని.. విదేశీ ఖాతాల్లోని నిధులను ట్రాన్స్‌ఫర్ చేయాలని తన ఫైనాన్స్ విభాగాన్ని ఆదేశించారు. అనుమానాస్పద లావాదేవీలను ఫిడ్యూరమ్ సంస్థ వెంటనే గుర్తించి.. తక్షణమే విదేశాల్లోని బ్యాంకులను, సిబ్బందిని అలర్ట్ చేసినట్లు సదరు కథనాలు తెలిపాయి. ఈ చర్యల వల్ల దాదాపు రూ.570 కోట్ల నగదును రికవరీ చేయగలిగారు. కానీ, మిగతా మొత్తం పలు విదేశీ ఖాతాల్లోకి బిట్‌కాయిన్, ఇతర క్రిప్టోకరెన్సీలుగా మారిపోవడంతో వాటిని గుర్తించలేకపోయినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోంది.



## కబడ్డీలో భారత్‌కు డబుల్ బొనాంజా

### అబ్బాయిలూ 'పసిడి' పట్టేశారు

ఆసియా క్రీడల కబడ్డీలో మన అమ్మాయిలు, అబ్బాయిలు ఇరాన్‌ను గట్టిగానే ఢీకొట్టారు. ఇప్పటికే ఆ దేశాన్ని ఓడించి మహిళల జట్టు స్వర్ణాన్ని దక్కించుకోగా.. పురుషుల జట్టు అదే బాటలో నడిచింది. ఉత్కంఠగా జరిగిన ఫైనల్లో పసిడి కూత పెట్టింది. డిఫెండింగ్ ఛాంపియన్ భారత్.. ఇరాన్‌ను 40-34 పాయింట్ల తేడాతో ఓడించింది. దీంతో కలిపి ఆసియా క్రీడల చరిత్రలో కబడ్డీ జట్టు తొమ్మిదిసార్లు బంగారు పతకాన్ని సొంతం చేసుకుంది. 2026 ఆసియా క్రీడల్లో భారత్‌కు ఇది నాలుగో స్వర్ణం.

### పతకాల పట్టికలో 10వ స్థానం..

2026 ఆసియా క్రీడల్లో ఇప్పటివరకు నాలుగు స్వర్ణాలతో భారత్ పతకాల పట్టికలో 10వ స్థానంలో నిలిచింది. 11 రజతాలు, 13 కాంస్యాలతో కలిపి మొత్తం 28 పతకాలను సొంతం చేసుకుంది. మహిళల క్రికెట్ ఫైనల్‌లో హర్మన్ ప్రీత్ సేన అద్భుత విజయంతో తొలి స్వర్ణాన్ని దక్కించుకోగా.. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో సురుచి సింగ్, కమల్‌జీత్ జంట శుక్రవారం పసిడి సొంతం చేసుకున్నారు. ఇక, శనివారం కబడ్డీలో రెండు స్వర్ణాలు వచ్చాయి. 2022 ఆసియా క్రీడల్లో భారత్‌కు మొత్తం 106 పతకాలు వచ్చాయి. వాటిలో 28 గోల్డ్‌మెడల్స్. ఈసారి భారత్ నాలుగో స్థానంలో నిలవగా.. చైనా తొలి స్థానంలో నిలిచింది.

# ఇదే నా చివరి ప్రపంచకప్

## సర్వశక్తులూ ధారపోస్తా: విరాట్ కోహ్లీ



టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ కీలక వ్యాఖ్యలు చేశాడు. వచ్చే ఏడాది జరగబోయే వన్డే ప్రపంచ కప్.. దేశం తరఫున తాను ఆడే చివరి మెగా టోర్నీ అని స్పష్టం చేశాడు. ఆ ట్రోఫీని కైవసం చేసుకునేందుకు మైదానంలో తన సర్వశక్తులూ ధారపోస్తానని తెలిపాడు. ఈ నెల 27 నుంచి వెస్టిండీస్‌తో ప్రారంభం కానున్న మూడు వన్డేల సిరీస్‌కు ముందు 'జియోస్టార్'తో కోహ్లీ మాట్లాడాడు. వచ్చే ఏడాది సౌతాఫ్రికా, జింబాబ్వే, నమీబియాలు సంయుక్తంగా వన్డే ప్రపంచకప్‌నకు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. "భారత్ తరఫున ఆడబోయే చివరి వరల్డ్‌కప్ ఇదే. టోర్నీని గెలవడమే నా ఏకైక లక్ష్యం. దాని కోసం ఎంత దూరమైనా వెళ్లేందుకు, మైదానంలో సర్వస్వం ధారపోసేందుకు సిద్ధంగా ఉన్నా" అని కోహ్లీ వెల్లడించాడు. వన్డే ప్రపంచకప్‌లో ఉండే ఇంటెన్సిటీ మరే ఇతర టోర్నమెంట్‌లోనూ ఉండదని చెప్పాడు. "ఇందులో దాదాపు 10 మ్యాచ్‌లను టీ20 స్థాయి తీవ్రతతో ఆడాల్సి ఉంటుంది. ఒక వన్డే మ్యాచ్ అనేది 2.5 టీ20లతో సమానం. పెద్ద టోర్నమెంట్ లేదా ప్రపంచకప్‌లో వరుసగా 10 మ్యాచ్‌లపాటు ఆ ఇంటెన్సిటీని కొనసాగించడం చాలా పెద్ద విషయం." అని తెలిపాడు.

# ఆసియా క్రీడల్లో భారత్‌కు మరో గోల్డ్

జపాన్ వేదికగా జరుగుతోన్న ఆసియా క్రీడల పతకాల పట్టికలో భారత్‌కు మూడో స్వర్ణం వచ్చి చేరింది. కబడ్డీ పోటీల్లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన మన అమ్మాయిలు.. ఫైనల్‌లో ఇరాన్‌ను ఓడించి బంగారు పతకాన్ని దక్కించుకున్నారు. నువ్వా నేనా అన్నట్టు సాగిన ఈ గేమ్‌లో 37-34 తేడాతో మన జట్టు ఇరాన్ నుంచి విజయాన్ని లాగేసుకుంది. మరోవైపు రైఫిల్ షూటింగ్‌లో రజతం దక్కగా.. స్క్వాష్ జోడీ సెమీస్‌లో తడబడి, కాంస్యంతో సరిపెట్టుకుంది. 50 మీటర్ల రైఫిల్ టీమ్ ఈవెంట్ లో తిలోత్తమా సేన్, విదర్శా వినోద్, ఆషి చౌక్సే రజతాన్ని సొంతం చేసుకున్నారు. ఈ పోటీల్లో చైనా బృందం 1773 పాయింట్లతో పసడి పతకాన్ని దక్కించుకోగా.. భారత బృందానికి 1763 పాయింట్లు రావడంతో రెండో స్థానంలో నిలిచింది. 1754 పాయింట్లు సాధించిన కజకిస్థాన్‌కు కాంస్యం దక్కింది. ఇక, స్క్వాష్ విభాగంలో మిక్స్‌డ్ డబుల్స్ జోడి జోష్న చిన్నప్ప-సెంథిల్ కుమార్‌కు కాంస్య పతకం దక్కింది. సెమీస్‌లో



హాంకాంగ్ ద్వయం లీ కా యి, తాంగ్ మింగ్ హాంగ్ చేతిలో ఓడింది. అంతకుముందు, భారత అథ్లెట్, హవల్దార్ సావన్ బర్వాల్ మారథాన్‌లో చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ పోటీల్లో రజతంతో మెరిసి 44 ఏళ్ల తర్వాత మన దేశానికి పతకం అందించాడు.




## భారత్ ఇంధన అవసరాల వైపు.. అమెరికా చూపు

పశ్చిమాసియా ఉద్రిక్తతలతో హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలకు అంతరాయం ఏర్పడినప్పటి నుంచీ భారత్.. ఇంధన దిగుమతుల కోసం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోంది. ఈ క్రమంలోనే భారత్ అవసరాలకు తగ్గట్టు ఇంధనం సరఫరా చేయాలని ట్రంప్ యంత్రాంగం యోచిస్తున్నట్లు అమెరికా విదేశాంగ శాఖకు చెందిన సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ప్రపంచ దేశాలపై టారిఫ్‌లు, ఇంధన ఆంక్షల విషయంలో అమెరికా కఠిన వైఖరి అనుసరిస్తున్నట్లు తెలిపారు. అదే సమయంలో భారత్‌కు భారీగా ఇంధన అవసరాలు ఉన్నందున.. ఆ అవకాశాన్ని తాము వినియోగించుకోవాలని అనుకుంటున్నట్లు పేర్కొన్నారు. యుద్ధం వల్ల కొన్ని నెలలపాటు ఇరాన్, పశ్చిమాసియా దేశాల నుంచి చమురు ఎగుమతులు నిలిచిపోవడంతో ప్రపంచ మార్కెట్‌లో ఇంధన లభ్యత పరిమితంగా ఉందని సదరు అధికారి పేర్కొన్నారు. అయితే వెనెజువెలాపై ట్రంప్ చేపట్టిన విజయవంతమైన ఆపరేషన్‌తో ప్రస్తుతం అమెరికా వద్ద పెద్ద మొత్తంలో చమురు నిల్వలు ఉన్నాయన్నారు. భారత్ వంటి మిత్ర దేశాలకు చమురు విక్రయించడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అమెరికా కాంగ్రెస్ ఇటీవల 'ద లిండ్సే గ్రాహమ్ శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్-2026' బిల్లును ఆమోదించిన సంగతి తెలిసిందే. దీనిపై ట్రంప్ సంతకం కూడా చేయడంతో ఇది చట్టరూపం దాల్చింది. రష్యా, ఇరాన్‌లపై ఆంక్షలను విధించేందుకు, వాటితో వాణిజ్యం జరుపుతోన్న భారత్, చైనా వంటి దేశాలపై సుంకాల మోత మోగించేందుకు ఈ చట్టంతో ట్రంప్‌నకు అధికారం లభించినట్లయ్యింది. ఈ కొత్త చట్టం.. భారత్, అమెరికా ద్వైపాక్షిక సంబంధాలపైనే కాకుండా అంతర్జాతీయ ఇంధన మార్కెట్లపైనా ప్రభావం చూపుతుందని భారత ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది.

Printed, published and owned by **VELLENKI JAYAPAL REDDY**, printed at **M/s KAKATIYA PRINTERS**, H-No: 24-91/72/1, Block No. 29, Plot Nos 72, 73 and 74, Lakshminarayana Nagar IDA Uppal, Uppal Mandal, Medchal-Malkajgiri Dist, Telangana-39, Published at H-No: 3-125/92/86, Anaghapuri Colony, Boduppal, Medipally Mandal, Medchal-Malkajgiri Dist, Telangana- 92, Editor: **VELLENKI JAYAPAL REDDY**, Cell No: **9346984911, 9133445456**, RNI NO: TELTEL/2023/84471, website: www.nedudailynews.com, e-mail: vellenkijayapalreddy@gmail.com